76809 94755 www.rajadhanivartalu.com rajadhanivartalu rajadhaniv RNI No. APTEL 2015/ 66622 స్థాపితం : 2015 Postal Regd No: GTR/84/2016-18




# రాజధాని వార్తలు

Voice of Voiceless

రాజధాని వార్తలు దినపత్రిక విజయవాడలో పనిచేయుటకు సబ్ ఎడిటర్లు, ఎడ్వర్టైజ్‌మెంట్ ఎగ్జిక్యూటివ్‌లు కావలెను అనుభవాన్ని బట్టి ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును.
76809 94755
rajadhanivartalu1@gmail.com

అమరావతి సంపుటి : 4 సంచిక 2, పేజీలు 4, వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ ' రాజధాని' తొలి తెలుగు వార పత్రిక సోమవారం 1 - ఆదివారం 7 అక్టోబర్, 2018

పేజీలు2లో...

ఆధార్- ఆకలి

పేజీలు3లో...

హంతకుడి కూతురు...

పేజీలు4లో...

రాఫెల్ రగడ

పేజీలు4లో...

'భూ(తా)తల' స్వర్గం అరకు

## ఏపీ ప్రధాన కార్యదర్శిగా అనిల్ చంద్ర



**రాజధాని వార్తలు, అమరావతి :** ఆంధ్రప్రదేశ్ చీఫ్ సెక్రటరీగా అనిల్ చంద్ర పునేఠా నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన భూపరిపాలన శాఖ ప్రధాన కమిషనర్‌గా పనిచేస్తున్నారు. ఈమేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చంద్రబాబును ఇవాళ పునేఠా అమరావతిలో కలిసి.. తనను సీఎస్‌గా ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుత సీఎస్ దినేష్‌కుమార్ పదవీ కాలం ఈ నెల 30తో ముగియనుంది. 1984 బ్యాచ్ ఐఏఎస్ అధికారి పునేఠ రాజంపేట సబ్ కలెక్టర్‌గా తన కెరీర్‌ను ప్రారంభించారు. శ్రీకాకుళం జిల్లా కలెక్టర్‌గా, ఉద్యాన, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్‌గా, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు.

## నాసా సదస్సుకు ఫిరోజ్




**రాజధాని వార్తలు తుళ్ళూరు :** అమెరికాలోని నాసా కెనడీ అంతరిక్ష పరిశోధనా కేంద్రంలో నవంబరులో జరిగే అంతర్జాతీయ అంతరిక్ష విజ్ఞాన సదస్సుకు రాష్ట్రం నుంచి తుళ్ళూరుకు చెందిన షేక్ సాహేఫిరోజ్ ఎంపికయ్యాడు. గతేడాది డిసెంబరులో జరిగిన వ్యాసరచన పోటీకి కేవీఆర్ జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న షేక్ షాహేఫిరోజ్ అంతరిక్షంలో ఒకరోజు వ్యాసాన్ని రాశాడు. భారతదేశవ్యాప్తంగా నిర్వహించిన ఆన్‌లైన్ పోటీలో విజయం సాధించాడు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపికైన 10 మందిలో జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థుల్లో ఫిరోజ్ మాత్రమే ఎంపిక కావడం గమనార్హం. మిగిలిన 9మంది వివిధ జిల్లాలకు చెందిన ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు. ఈ సందర్భంగా తుళ్ళూరు పాఠశాలలో ఫిరోజ్‌ను అభినందించారు. ప్రధానోపాధ్యాయుడు కృష్ణారావు మాట్లాడుతూ అమెరికాలో 9 రోజుల పాటు నిర్వహించే సదస్సుకు ఫిరోజ్ ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు.

## అక్టోబర్ 3న మంత్రివర్గ సమావేశం

**రాజధాని వార్తలు అమరావతి :** వెలగపూడి తాత్కాలిక సచివాలయంలో 1వ బ్లాక్ మొదటి అంతస్తులోని కేబినెట్ సమావేశ మందిరంలో అక్టోబర్ 3వ తేదీ సాయంత్రం 3 గంటలకు మంత్రివర్గ సమావేశం జరుగుతుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేశ్‌కుమార్ ఓ ప్రకటన విడుదల చేశారు.

# తాగుబోతుల్లో ఏపీటాప్



**రాజధాని వార్తలు, అమరావతి :** తెలుగువాళ్లే మద్యం వినియోగంలో మొదటిస్థానంలో ఉన్నారని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అకడమిక్ రిజిస్ట్రార్ డాక్టర్ జయరాం తెలిపారు. అందునా ఏపీ టాప్‌లో ఉందన్నారు. ఏపీలో మద్యం తాగే వ్యక్తి సగటున ఏడాదికి 34.5 లీటర్స్ ఆల్కహాల్ తాగుతున్నారని తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో బాలురు 15 ఏళ్ల వయసులోనే మద్యపానం మొదలుపెడుతున్నారని జయరాం చెప్పారు. విజయవాడ నాగార్జున ఆసుపత్రిలో గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ జగన్మోహన్‌రావు మాట్లాడుతూ.. చాలా చిన్న వయసులో మద్యపానం మొదలుపెట్టడం వల్ల.. 30-35 ఏళ్ల వయసులోనే చాలా మంది లివర్ సమస్యలకు గురవుతున్నారని ఈ మధ్య చాలా మంది ఈ సమస్యలతో వస్తున్నారని వివరించారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రాంక్రియాటైటిస్ బాధితులు కూడా పెరిగారని ఇవన్నీ అధిక మద్యపానం వల్ల వచ్చే దుష్పరిణామాలని వివరించారు.


2005లో భారత్‌లో ఏడాదికి సగటున 2.4 లీటర్ల ఆల్కహాల్(ఒక బీరులో 33 గ్రాములు ఉంటుంది) తాగుతుండగా.. ఇది 2010కి 4.3 లీటర్లకు.. 2016కి 5.7 లీటర్లకు పెరిగింది. 2025కి 7.9 లీటర్లకు చేరుతుందని అంచనా. దేశంలో బీరు వినియోగం 8 శాతం మేర ఉండగా.. వైన్ 1 శాతం కంటే తక్కువగా ఉంది. మద్యం ఎక్కువగా తాగడం వల్ల 2016లో ప్రపంచ వ్యాప్తంగా 30 లక్షల మంది చనిపోయారని ప్రపంచ ఆరోగ్య సంస్థ తాజా నివేదిక వెల్లడించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అదానోమ్ మాట్లాడుతూ.. " అతి మద్యపానం వల్ల చాలా మంది ప్రజలు, కుటుంబాలు, సమాజాలు తీవ్రమైన పరిణామాలను ఎదుర్కొంటున్నాయని వివరించారు. అతి మద్యపానం వల్ల హింస, గాయాలు, మానసిక సమస్యలు, కేన్సర్, స్ట్రోక్ తదితర అనారోగ్యాలతో చనిపోతున్నారని ఆయన తెలిపారు. ఈ దుష్పరిణామాలను నియంత్రించేందుకు, ఆరోగ్యవంతమైన సమాజాల అభివృద్ధికి వెంటనే చర్యలు చేపట్టాల్సిన సమయం ఆసన్నమైందని సూచించారు. అతి మద్యపానం వల్ల చనిపోయేవారిలో 28 శాతం మంది దెబ్బలు తగలడం వల్ల చనిపోతున్నారు. ప్రపంచవ్యాప్తంగా 28శాతం మంది తాగి గాయాలపాలవడం, 21 శాతం మందికి జీర్ణక్రియ ఇబ్బందులు, 19శాతం హృద్రోగాలు, తక్కినవారు కేన్సర్‌ల వల్ల, 4.6 కోట్లమంది ఇతర ఇన్‌ఫెక్షన్లవల్ల మృతి చెందుతున్నారు.

### రాష్ట్ర ఆదాయంలో పెట్రో, మద్యమే కీలకం

మద్యాన్ని ఆదాయ వనరుగా పరిగణించటంలేదని ప్రభుత్వం చెబుతున్నా, దీనిపై వచ్చే పన్నుల ఆదాయాన్ని చూసేస్తే పాలకులు దేనికి ప్రాధాన్యం ఇస్తున్నారో స్పష్టమవుతోంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఆగస్టునాటికి రూ.8,142.48 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు జరిగాయి. అందులో అక్షరాలా రూ.4,374.41 కోట్లు జీఎస్టీ, వ్యాట్ పన్నులే ఉండటం గమనార్హం. రాష్ట్రంలో ప్రతి నెలా సగటున రూ.1650 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. అమ్మకాల విలువతోపాటు పన్నుల రూపంలో ఆదాయం కూడా భారీగా పెరుగుతోంది. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ ప్రధాన కార్యాలయం విజయవాడలో ఉండటంతో, మద్యంపై జీఎస్టీ, వ్యాట్ ట్యాక్స్ విజయవాడ నుంచే లభిస్తుంది. అలాగే విశాఖ, కాకినాడలో ఆయిల్ రిఫైనరీలు ఉన్నందున ఆ రెండు చోట్ల నుంచి పెట్రో ఉత్పత్తుల పన్ను వసూలవుతుంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు పెట్రోలు, డీజిల్‌పై విధించిన పన్నుల ద్వారా వాణిజ్య పన్నులశాఖకు రూ.4,673.75 కోట్ల ఆదాయం సమకూరింది. రాష్ట్రంలోని పలు జిల్లాలతోపాటు ఇతర విభాగాల ద్వారా మరో రూ.2,201 కోట్ల పన్ను ఆదాయం లభిస్తోంది. అలాగే వృత్తి పన్ను ద్వారా మరో రూ.74 కోట్ల ఆదాయం వస్తున్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నారు. ప్రతి నెలా సగటున రూ.3,441 కోట్లు పన్నుల రూపంలో వాణిజ్య పన్నులశాఖకు లభిస్తోందని అధికారులు చెబుతున్నారు.

# ఆర్థిక సంక్షోభంలో పవన్ ?

### జనసేనకు రోజుకు రూ.5 లక్షల ఖర్చు



**రాజధాని వార్తలు, అమరావతి :** పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ స్టార్‌డమ్‌లో ఉండగానే జనసేన పార్టీ స్థాపించాడు. పార్టీ ఎలా ఉందనే విషయం అలావుంచితే, ప్రస్తుతం ఆయన తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నట్లు సమాచారం. హీరోగా అత్యంత ఆడంబర జీవితం గడిపిన పవన్ ఇప్పుడు చాలా నిరాడంబరంగా ఉన్నాడు. ఒకప్పుడు ఏడు నక్షత్రాల హోటళ్లలో బస చేసిన పవన్ ఇప్పుడు తన పోరాటయాత్రలో కళ్యాణ మండపాల్లో, సత్రాల్లో బస చేస్తున్నాడు. ఒకప్పుడు ప్రైవేట్ జెట్ విమానాల్లో తిరిగిన ఈ హీరో ఇప్పుడు కార్లలో రోడ్డు మార్గాన ప్రయాణిస్తున్నాడు. ఆర్థిక బాధలంటే ఏమిటో తెలియని పవర్‌స్టార్ ఇప్పుడు ఆర్థిక పాఠాలు నేర్చుకుంటున్నాడట. చేతిలో నిధులు లేకపోవడంవల్లనే ఆయన పోరాటయాత్రకు నెలకు పైగా విరామం వచ్చింది. ఆర్థిక సంక్షోభానికి తోడు మధ్యలో కంటి ఆపరేషన్ జరిగి యాత్ర మరింత ఆలస్యమైంది. పవన్ భారీ మొత్తాల్లో విరాళాలు స్వీకరించడంలేదని తెలుస్తోంది. ఆర్థిక సంక్షోభానికి ఇది ప్రధాన కారణంగా జనసేన వర్గాలు చెబుతున్నాయి. పవన్ ఈ విధంగా వ్యవహరిస్తే పార్టీని నడపడం కష్టమంటున్నారు. సినిమాల్లో తాను సంపాదించినదంతా నాలుగేళ్లలో పార్టీకే ఖర్చుపెట్టాడని చెబుతున్నారు. పవన్ చేస్తున్న పోరాటయాత్ర ఖర్చుతో కూడుకున్న వ్యవహారం.

రవాణా, బస, ఆహారం మొదలైన ఖర్చులన్నీ కలుపుకొని దీనికి రోజుకు ఐదులక్షలు ఖర్చవుతున్నాయని పార్టీ నేతలు చెబుతున్నారు. ఇక పవన్ కళ్యాణ్ వ్యక్తిగత సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది అంతా కలుపుకొని 160 మంది వరకు ఉన్నారు. వీరందరికీ జీతాలు చెల్లించాలి. ఇతర ఖర్చులు బోలెడు ఉన్నాయి. ఈయన ఎలాంటి షరతులు లేకుండా ఇచ్చే విరాళాలు మాత్రమే ఆమోదిస్తున్నాడట. (ఒక వర్గానికి చెందిన వారి నుంచి ఆపార్టీ ప్రధాన నేత భారీ మొత్తాలను సేకరించే దృశ్యాలను హెచ్‌ఎంటీవీ మూర్తి బయట పెట్టి ఉద్యోగం పోగొట్టుకున్న విషయం తెలిసిందే.) దీంతో ఆర్థికంగా ఇబ్బందులు తప్పడంలేదట టీడీపీ, టీఆర్ఎస్ సహా అనేక పార్టీలు ఆర్థికంగా బలంగా ఉన్నాయి. పేదల పార్టీలుగా చెప్పుకునే ఉభయ కమ్యూనిస్టు పార్టీలూ ఆర్థికంగా మంచి స్థితిలోనే ఉన్నాయి. త్వరలో ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడకుంటే పాతికేళ్లు రాజకీయాల్లో ఉంటానని ఆయన చెప్పింది వాస్తవరూపం దాల్చదు.

# వెల్లంపల్లితో సీటు పోయేనా?

- విజయవాడ పశ్చిమలో సీట్లపోరు
- పార్టీ ఫిరాయించిన జలీల్‌ఖాన్ వద్దు
- వెల్లంపల్లి ఆర్ఎస్ఎస్ వ్యక్తి
- ముస్లింలకే సీటు ఖరారు చేయాలంటున్న మైనార్టీలు


ఆర్ఎస్ఎస్ కార్యకర్తగా వెల్లంపల్లి శ్రీనివాస్ (ఫైల్)

**రాజధాని వార్తలు, అమరావతి :** కృష్ణా జిల్లాలోని 16 శాసనసభ నియోజక వర్గాలలో విజయవాడ పడమర నియోజకవర్గం ఉంది. 1967లో జరిగిన డీలిమిటేషన్ ఉత్తర్వులతో ఇది ఏర్పడింది. 2014లో జరిగిన ఎన్నికలలో అప్పటి వైఎస్ఆర్‌సిపీ అభ్యర్థి జలీల్‌ఖాన్ 3108 ఓట్ల మెజారిటీతో బిజేపీ అభ్యర్థి వెల్లంపల్లి శ్రీనివాసరావు పై గెలిచారు. తరువాత జలీల్‌ఖాన్ పార్టీ మారి టీడిపీలో చేరారు. గడిచిన 6 ఎన్నికలలో 4సార్లు ముస్లిం అభ్యర్థి గెలిచారు. దాంతో వచ్చే ఎన్నికల్లో ముస్లిం అభ్యర్థికే గెలిచే అవకాశాలు ఉన్నాయి. టీడీపీ కూడా ముస్లిం అభ్యర్థినే దించబోతుందనే సమాచారం. ముస్లింలే కాక నగరాలు, వైశ్యులు, యస్.సి, బి.సి.లు వైయస్ఆర్‌సిపీ వైపే మొగ్గు చూపుతున్నారని స్థానికులు చెప్తున్నారు.

విజయవాడ పశ్చిమ నియోజవర్గంలో ముస్లీంలకు మంచి పట్టుంది. టీడీపీలోకి జలీల్‌ఖాన్ జంప్ చేయడం మారిన రాజకీయాల నేపథ్యంలో స్థానికుడు వెల్లంపల్లి శ్రీనివాసరావు బీజేపీకి రాజీనామ చేసి వైసీపీలోకి మారడంతో ఆయనకే పశ్చిమ విజయవాడలో వైసీపీ సీటు కేటాయించే పరిస్థితులు నెలకొన్నాయి. ప్రస్తుతం ఆయనే వైసీపీ ఆ నియోజకవర్గ సమన్వయకర్తగా కూడా ఉన్నారు. వెల్లంపల్లి సంఘ్‌నేతృత్వంలోని ఆర్ఎస్ఎస్‌లో అనేక ఏళ్లపాటు కార్యకలాపాలు సాగించడంతో ఆయనలో ముస్లింలను కలుపుకుపోయే తత్వంలేదని స్థానిక ముస్లింలు చెబుతున్నారు. ఇటీవల జగన్ నిర్వహించిన ప్రజా సంకల్ప యాత్రలో ప్లేక్సీల మాటున ముస్లీంలపై

- మిగతా 3 లో

## ఈవారం రాజధాని

- ముఖ్యమంత్రి యువనేస్తం అక్టోబర్ 2న అధికారికంగా ప్రకటన
- ఉద్యోగులు పెన్షనర్లకు ఆరోగ్య పరీక్షలు నవంబరు నుంచి ప్రారంభమయ్యే అవకాశం.
- అమరావతిలో భూగర్భ విద్యుత్ వ్యవస్థ సీఆర్‌డీఏ కు ప్రణాళిక సమర్పించిన ట్రాన్స్‌కో


# కుళాయి ఇక కలేనా..!



- లక్ష్యం చేరని ప్రభుత్వ ఆశయం
- మరుగుపడ్డ రూ.200 కనెక్షన్
- అధిక వ్యయంతోనే వెనకడుగు

**రాజధాని వార్తలు అమరావతి :** పేద ప్రజలకు కుళాయి కనెక్షన్లు అత్యంత కారుచౌకగా అందించాలన్న ప్రభుత్వ ఆశయం అనుకున్న స్థాయిలో

- మిగతా 2 లో




# పోలీసు పాట్లు



లాఠీలు పక్కనపెట్టి చీపుర్లు పట్టుకున్న సెక్యూరిటీ గార్డులు

తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నడుస్తున్న విష్ణు నివాసంలో కాంట్రాక్టరు వేధింపులకు పాల్పడుతున్నాడని, జీతాలు సక్రమంగా ఇవ్వడంలేదని పారిశుద్ధ్య పనివారు చీపుర్లు వదిలేసి నిరసన తెలుపుతుండగా ఈ ఘటన చోటు చేసుకుంది.






## రాజధాని వార్తలు కలం

### తీర్పులు-పర్యవసానాలు

వందమంది దోషులు తప్పించుకున్నా పర్వాలేదుకాని, ఒక్క నిర్ధోషికూడా శిక్షింపబడకూడదన్న మూల సూత్రంపై భారత న్యాయవ్యవస్థ పనిచేస్తోంది. ఏ కేసునైనా అన్నికోణాల్లో కూలంకుషంగా చర్చించి తీర్పులను సహేతుకంగా వెలువరించాలన్న ఆకాంక్ష దీని ద్వారా వ్యక్తమవుతుంది. అక్టోబరు 2న చీఫ్ జస్టిస్ పదవీవిరమణ చేయనుండగా గత వారంలో ముఖ్యమైనవి రెండు కేసుల్లో అత్యున్నత న్యాయస్థానం తీర్పును వెలువరించింది. ఒకటి ఆధార్‌మీద కాగా, రెండవది లైంగిక కార్యకలాపాల్లో మహిళల స్థితిపై తీర్పులు వెలువరించాయి. ఇంతకు ముందే ముమ్మరు తలాఖ్ గురించి తీర్పు వెలువరిస్తూ ఏకసమయంలో మూడు సార్లు తలాఖ్ అని చెప్పడం ద్వారా విడాకులు మంజూరు కావని తీర్పు వెలువరించారు. దేశవ్యాప్తంగా అనేక దశాబ్దాలుగా కోర్టులో నలుగుతున్న రామజన్మభూమి-బాబ్రీమసీదు కేసును సివిల్ కేసుగా పరిగణిస్తూ తీర్పు వెలువరించింది. ఏతీర్పు ముఖ్య ఉద్దేశ్యమైనా అట్టడుగు వర్గాలకు కూడా మంచిని చేయాలన్నదే సుప్రీంకోర్టు లక్ష్యంగా పనిచేస్తోంది. అయితే ఆధార్‌ను మొదటి నుంచి గుర్తింపు పత్రంగా చూడవద్దని, దానికి అనుసంధానం కాలేదన్న నెపంతో సంక్షేమ పథకాలు అమలుకు అడ్డంకి కల్పించవద్దని అనేక సార్లు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను హెచ్చరించిన అత్యున్నత న్యాయస్థానం ప్రస్తుతం ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను ఆధార్ అవసరమని చెప్పడం ఎంతవరకు కరెక్టు అన్నదానిపై సామాజిక వేత్తలు మథన పడుతున్నారు..

వాస్తవానికి ఆధార్‌తో అనుసంధానం కాలేదన్న కారణంగా ఈశాన్యదేశాల్లో ఇప్పటివరకు అనేకమంది ఆకలి చావులకు గురయ్యారన్నది సత్యం. అయితే ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు వారంతా రోగాలతో చచ్చిపోయారని, ప్రభుత్వం పక్కాగా ప్రజాపంపిణీని నిర్వహిస్తోందని గదమాయిస్తున్నాయి. యూపీఏ ప్రభుత్వం 2013లో జాతీయ ఆహార హక్కును తీసుకొచ్చినా ఆధార్ అనుసంధానం చాలా మందికి తెలియకపోవడం, సిబ్బంది నిర్లక్ష్యంతో గ్రామీణ పేదలు మెతుకు దొరకక ప్రాణాలు కోల్పోతున్నారు. 72 ఏళ్ల స్వతంత్ర్య భారతంలో ఇటువంటి హృదయవిదారక ఘటనలు జరగడం వేదనాకరం. ఇదే సమయంలో వృద్ధులకు, పేదకళాకారులకు, వితంతువులకు ఇచ్చే పింఛన్ ఆగిపోతే పరిస్థితి ఏమిటి ? వాస్తవానికి ఈ ఘటనలను దృష్టిలోకి తీసుకొని అత్యున్నత న్యాయస్థానం తీర్పులు వెలువరిసేప్త బాగుండేది.

భారతీయ శిక్షాస్మృతిలో సెక్షన్ 497 పేరిట ఒక చట్టం ఉంది. "ఎవరైనా వేరే వ్యక్తి భార్యతో... ఆ వ్యక్తి (భర్త) అనుమతి లేకుండా లైంగిక సంబంధం పెట్టుకుంటే అది వివాహేతర సంబంధం కింద నేరం అవుతుంది." అని ఈ చట్టం చెబుతుంది. ఈ సెక్షన్ ను సుప్రీం కోర్టు గురువారం నాటి తీర్పులో కొట్టివేసింది. మన దేశం సంప్రదాయాలకు, సంస్కృతికి ఆనవాలంగా ఉంటూ వచ్చింది. ఇకపై అవి ఉండబోవన్న సంకేతం వెలువడింది. వాస్తవానికి 497 ప్రకారం పెళ్లయిన భార్య భర్తను మోసం చేసి మరొక పెళ్లయిన వ్యక్తితో లైంగికకార్యకలాపాలు జరిపితే అది ఆమె భర్తకు తెలియకుండా జరపడం నేరంగా వస్తూ వచ్చింది. దీంతో న్యాయస్థానాలు పురుషులకు మాత్రమే శిక్ష విధించి, మహిళలను వదిలిపెట్టేవి. మహిళలంతా తాము పురుషుల ఆస్తిగా సమాజం, కోర్టులు చూడటం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని భావిస్తూ మహిళలు కోర్టు మెట్లెక్కారు. దీని ప్రకారం మహిళల మనోభావాలను అర్థం చేసుకుంటూ తీర్పు వెలువరిస్తే సరిపోయేది. అలా కాకుండా ఇష్టపూర్వకంగా ఎవరు ఎవరితోనైనా లైంగిక సంబంధం పెట్టుకోవచ్చని తీర్పువెలువరించడం ఎంతవరకు సమంజసం ? ఇప్పటికే 'అక్రమ సంబంధం' అనే పదానికి అర్థం లేకుండాపోయింది. నిజానికి ఈ పదాన్ని మీడియా కూడా చాలా సంవత్సరాల కిందటే బ్యాన్ చేసింది. 'వివాహేతర సంబంధం' అనేపదం మాత్రమే రాస్తున్నారు. అంటే వివాహేతర సంబంధాన్ని 'అక్రమం' అని గుర్తించేపోకడ నుంచి మనం బయటకు వచ్చాం. ఇప్పుడు దానికి చట్టబద్ధత కూడా వచ్చేసింది. అది 'నేరం' కూడా కాదు అని సుప్రీం తేల్చింది. కుటుంబ వ్యవస్థలో సున్నితమైన అనుబంధాల విషయంలో ఈ తీర్పు తీవ్రమైన ప్రభావం చూపించే అవకాశం ఉంది. ఈ వెసులుబాటు సమాజాన్ని ఎక్కడిదాకా తీసుకెళ్తుందో చూడాలి.

# ఆధార్- ఆకలి



ఆధార్ చట్టబద్ధతపై అత్యున్నత ధర్మాసనం కీలక తీర్పు ఇచ్చింది. కేంద్రం తీసుకొచ్చిన ఆధార్ స్కీమ్ రాజ్యాంగపరంగా చట్టబద్ధమైనదేనని సుప్రీంకోర్టు ప్రకటించింది. ప్రభుత్వ సేవలన్నింటికీ ఆధార్ తప్పనిసరి అని చెప్తున్న దశలో సుప్రీంకోర్టు.. అసలు ఆధార్ ఎక్కడ అవసరం? ఎక్కడ అవసరం లేదు..? అనే అంశాలపై స్పష్టతనిచ్చింది. అయితే ఈ తీర్పు వెలువరించే సమయలో అత్యున్నత న్యాయస్థానం క్షేత్రస్థాయిలో పరిశీలన జరపలేదని ఆహార హక్కుకార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు కారణం ఇప్పటికీ ఈశాన్య రాష్ట్రాల్లో చాలా మందికి ఆధార్ లేదు. దీంతోఅక్కడి పేదలు ప్రజాపంపిణీ వ్యవస్థ నుంచి సరకులు తీసుకోలేకపోతుండటంతో ఆయా ప్రాంతాల్లో ఆకలి చావులు సంభవిస్తున్నాయి. బ్యాంకు ఖాతాలు,టెలికాం సేవలు,మొబైల్ కనెక్షన్లకు,పాఠశాలలు, కళాశాలల్లో అడ్మిషన్లకు,సీబీఎస్ఈ, నీట్, యూజీసీ పరీక్షలకు పేమెంట్ ఈవేలెట్స్‌కు,మోటార్ డ్రైవింగ్ లైసెన్స్,కరెంటు, నీటి కనెక్షన్ల,పాస్‌పోర్టు దరఖాస్తుకు అనవసరమన్న సుప్రీంకోర్టు పాన్ కార్డు, ఆదాయపన్ను రిటర్నులు,ప్రభుత్వ సబ్సిడీలుసంక్షేమ పథకాల నుంచి లబ్ధి పొందడానికి ఆధార్ తప్పనిసరి చేశారు.

ఈశాన్య భారతంలోని జార్ఖండ్ రాష్ట్రం సిండేగా జిల్లా కారామాటి గ్రామంలో 100 కుటుంబాలుంటాయి. వెనుకబడిన వర్గానికి చెందిన సంతోషి కుటుంబానికి రేషన్ డీలర్ 8 నెలలుగా సరకులు ఇవ్వడంలేదు.

కారణం.. ఆధార్ కార్డుతో రేషన్ కార్డును లింక్ చేయలేదంట. పదకొండేళ్ల సంతోషి నాలుగు రోజుల పాటు ఆకలితో అలమటించింది. కానీ, రేషన్ దొరకలేదు. తినడానికి అన్నం లేక ఆమె చనిపోయిందని కుటుంబీకులు చెబుతున్నారు.

**'ఆకలి నొప్పి'**

అనారోగ్యం కారణంగా సంతోషి తండ్రి ఏ పనీ చేయలేరు. అందువల్ల కుటుంబ భారమంతా తల్లీకూతుళ్లపైనే. తల్లి కోయలిదేవి, పెద్ద కూతురు ఇద్దరూ కలిసి వేప పుల్లలు అమ్ముకునో, ఎవరింట్లో అయినా పాచిపని చేసుకుంటూనో కుటుంబాన్ని పోషిస్తున్నారు. వెనుకబడిన వర్గానికి చెందిన వారు కావడంతో ఎవరూ వారికి పని ఇవ్వటానికి ఆసక్తి చూపలేదు. తమ కుటుంబంలో ఎన్నో రాత్రులు ఆకలితో గడిచిపోతాయని సంతోషి తల్లి తెలిపారు. "సెప్టెంబరు 28 మధ్యాహ్నం కడుపులో నొప్పి వస్తోందని సంతోషి చెప్పింది. ఆకలి వల్లే ఆమెకు కడుపునొప్పి వచ్చిందని, అన్నం తినిపిస్తే నొప్పి తగ్గిపోతుందని ఊర్లో ఉన్న డాక్టరు చెప్పారు.'"కానీ సంతోషికి తినిపించడానికి ఇంట్లో ఒక్క మెతుకు అన్నం కూడా లేదు. అప్పటికే సంతోషి అన్నం కావాలి అని ఏడవటం మొదలుపెట్టింది. ఆమె కాళ్ళు చేతులు బిగుసుకుపోయాయి. ఇంట్లో



ఉన్న టీ పొడి, ఉప్పు కలిపి టీ కాచి, సంతోషికి ఇవ్వాలని అనుకున్నాను. ఇంతలోపే సంతోషి గిలగిలా కొట్టుకుంటూ చనిపోయింది" అని కోయలిదేవి తెలిపారు.

ఈ ఘటన తర్వాత 'రైట్ టు ఫుడ్'కు చెందిన ఐదుగురు సభ్యుల బృందం కారామాటి గ్రామానికి వెళ్లి దర్యాప్తు చేపట్టింది. వారి వెంట ఆ రాష్ట్ర ఫుడ్ కమిషన్ బృందం కూడా ఉంది. సంతోషి ఆకలి వల్లే చనిపోయిందని కోయల్ దేవి నాకు చెప్పారు" అని ఈ బృందంలో సభ్యులయిన ధీరజ్ కుమార్ తెలిపారు.

**- బోస్**

# భట్నాగర్ పురస్కార విజేతకు రూ. 1 కోటి

**రాజధాని వార్తలు అమరావతి :** ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో పనిచేసే ప్రొఫెసర్లు ఎవరైనా భవిష్యత్తులో ప్రతిష్టాత్మక శాంతిస్వరూప్ భట్నాగర్ పురస్కారానికి ఎంపికైతే యాజమాన్యం తరపున ప్రోత్సాహక పారితోషికంగా రూ.1 కోటి అందజేయడం జరుగుతుందని అమరావతి ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం ప్రొ వైస్ ఛాన్సలర్ డాక్టర్ డి. నారాయణరావు వెల్లడించారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో పరిశోధనలను ప్రోత్సహించాలన్న ఆశయంతో ఎస్ఆర్ఎం ఈ నిర్ణయాన్ని తీసుకుందని డాక్టర్ నారాయణరావు పేర్కొన్నారు. చిత్తూరు. జిల్లా గాదంకిలోని జాతీయ వాతావరణ పరిశోధనా ప్రయోగశాల (ఎన్ఏఆర్ఎల్) కు చెందిన యువ శాస్త్రవేత్త డాక్టర్ మాదినేని వెంకటరత్నం 2018 సంవత్సరానికి ప్రతిష్టాత్మక శాంతిస్వరూప్



**ఈ ఏడాది డాక్టర్ శాంతి స్వరూప్ భట్నాగర్ పురస్కారానికి ఎంపికైన శాస్త్రవేత్త డాక్టర్ వెంకటరత్నం**

భట్నాగర్ పురస్కారానికి ఎంపికయ్యారు. ఢిల్లీలోని శాస్త్రీయ పారిశ్రామిక పరిశోధనా

- శాస్త్ర, సాంకేతిక పరిశోధనలను ప్రోత్సహించడమే లక్ష్యం
- ఎస్ఆర్ఎం ప్రొ వైస్ ఛాన్సలర్ డాక్టర్ నారాయణరావు

మండలి (సీఎస్ఐఆర్) పురస్కారాలకు ఎంపికైన శాస్త్రవేత్తల జాబితాను ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్ నుంచి డాక్టర్ వెంకటరత్నం ఒక్కరే ఎంపిక కావడం తెలుగుజాతి గర్వించదగ్గ విషయమని డాక్టర్ నారాయణరావు అభిప్రాయపడ్డారు. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేసిన డాక్టర్ వెంకటరత్నం తన పూర్వ పరిశోధనా విద్యార్థిగా పేర్కొన్న డాక్టర్ నారాయణరావు భారత శాస్త్రవేత్తలకు అరుదుగా లభించే పురస్కారాల్లో శాంతిస్వరూప్ భట్నాగర్ అవార్డు ఒకటిగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ నారాయణరావు పురస్కార గ్రహీత డాక్టర్ వెంకటరత్నంకు అభినందనలు తెలిపారు.

**భవిష్యత్తులో ఎస్ఆర్ఎం నుంచి...**

భవిష్యత్తులో ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తలు శాంతిస్వరూప్ భట్నాగర్ పురస్కారానికి ఎంపికయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయని డాక్టర్ నారాయణరావు అభిప్రాయపడ్డారు. సృజనాత్మక పరిశోధనలను మరింత ప్రోత్సహించే ఉద్దేశంతో ఎస్ఆర్ఎం యూనివర్సిటీ యాజమాన్యం రూ.1 కోటి నగదు పారితోషిక ప్రకటన చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ మేరకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను, అత్యాధునిక ప్రయోగ శాలలను విశ్వవిద్యాలయంలో అందుబాటులో ఉంచినట్లు వివరించారు. ఈ నేపథ్యంలో విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్లు సైన్స్ అండ్ ఇంజినీరింగ్ రంగాల్లో మెరుగైన పరిశోధనల వైపు అడుగులు వేయాలని డాక్టర్ నారాయణరావు సూచించారు.

# కుళాయి ఇక కలేనా..!

(మొదటిపేజీ తరువాయి)

అమలు కావడం లేదు. ఇటీవల శాసనమండలి సమావేశాలలో సైతం మంత్రి నారాయణ రూ.200కే కుళాయి కనెక్షన్లు ఇస్తున్నామని చెప్పారు. కానీ వాస్తవిక పరిస్థితులలో చూస్తే ఏ ఒక్క మున్సిపాలిటీలో, కార్పొరేషన్‌లో ప్రభుత్వ ఉత్తర్వులు పాటిస్తున్న దాఖలాలు లేవు. దీంతో మెరుగైన తాగునీటిని సరఫరా చేయాలన్న ప్రభుత్వ లక్ష్యం నీరుగారి పోతోంది. దారిద్ర్య రేఖకు దిగువను ఉన్న వారికి రూ.200కే కనెక్షన్ ఇవ్వాల్సి ఉండగా, బీపీఎల్ కానీ కుటుంబాల వారికి ఆయా మున్సిపాలిటీల్లో నిర్ణయించిన ధరను వాయిదాల రూపంలో చెల్లించే వెసులుబాటు కల్పించారు. అయితే ఇప్పటి వరకు బీపీఎల్ కుటుంబాల నుంచి 30,556 దరఖాస్తులు రాగా 23,344 మంజూరు చేశారు. అందులో 18,337 కనెక్షన్లు మాత్రమే ఇచ్చారు. అయితే బీపీఎల్‌యేతర కుటుంబాల నుంచి 22,636 దరఖాస్తులు రాగా, 16,618 మంజూరు చేశారు. అయితే ఇప్పటివరకు మంజూరైన వాటిలో 13,010 కనెక్షన్లు ఇచ్చినట్లు అధికారిక గణాంకాలు తెలియచేస్తున్నాయి. అంటే మొత్తంగా 53 వేల పైగా దరఖాస్తులు రాగా 31,347 నివాసాలకు మాత్రమే కుళాయిలు అమర్చారు. అత్యధిక శాతం పురపాలక, నగరపాలక సంస్థలలో ఒక్క కనెక్షన్ కూడా ఇవ్వలేదంటే అధికారులు ఎంత నిర్లక్ష్య ధోరణి కనబరుస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.

**ప్రకటనలకే పరిమితమా..?**

ప్రభుత్వం ప్రకటించిన విధంగా రూ.200కే కుళాయి కనెక్షన్ ఇవ్వాలంటే ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కావటంతో అధికారులు వెనకడుగు వేస్తున్నారు. బీపీఎల్ విభాగంలో అర్హులైన వారికి కేవలం రూ.200 మాత్రమే చెల్లించి కనెక్షన్ పొందండి అని ప్రభుత్వం ప్రకటనలు చేస్తున్నా ప్రజలకు నిరాశే ఎదురవుతోంది. ఒక్కో కుళాయి కనెక్షన్ ఇచ్చేందుకు పైప్‌లైన్ ఏర్పాటు చేయడంతోపాటుగా ట్యాప్‌లు, ఇతర మెటీరియల్ వంటి వాటిని కొనుగోలు చేసే నిమిత్తం దాదాపుగా రూ.2 వేల నుంచి రూ 2,500 వరకు ఖర్చువుతుంది. ఈ క్రమంలో




అంత ఖర్చు పెట్టేందుకు నగరపాలక, పురపాలక సంస్థలు అంతగా ఆసక్తిని కనబరచటం లేదని తెలుస్తోంది. ప్రజలు దరఖాస్తు చేసుకునేందుకు వెళ్లినా అధికారులే అవి వచ్చినప్పుడు కదా అంటూ నిరుత్సాహ పరుస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ఆశావాహులు ప్రభుత్వం పథకాలు ప్రకటనలకే పరిమితమా అంటూ విమర్శిస్తున్నారు. సాధారణంగా కుళాయి కనెక్షన్ ఇచ్చేందుకు పురపాలక, నగరపాలక సంస్థలలో రూ.4 వేలు నుంచి రూ.8 వేలు వరకు వసూలు చేస్తున్నారు. కాగా కొన్ని చోట్ల కుళాయి కనెక్షన్లు ఇచ్చే పరిస్థితి లేకపోవడంతో సిబ్బంది తమ చేతివాటం ప్రదర్శించి ఇంకా ఎక్కువ మొత్తంలో వసూలు చేస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. అయితే మంజూరైన కుళాయి కనెక్షన్ ఇచ్చేందుకు మున్సిపల్ సిబ్బంది ఆనధికారికంగా రూ.5 వేలు పైబడి వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు సైతం వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే కేంద్రంతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం తాగునీటిని అందించే విషయమై రూ.2 వేల కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే మెరుగైన తాగునీటిని అందించటంతో పాటు కుళాయి కనెక్షన్లు ఇవ్వాలని సర్కారు సూచించింది. అయితే ఉన్నతాధికారులు మాత్రం కుళాయి కనెక్షన్ల విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే సహించేది లేదని స్పష్టం చేస్తున్నారు. మరి ప్రభుత్వం రూ.200కే కుళాయి అంటూ ప్రచారం చేస్తున్న నేపథ్యంలో ఏ విధంగా ముందుకెళ్తారన్నది ఆసక్తికరంగా మారింది.




# మహాత్మాగాంధీ స్ఫూర్తి శిరోధార్యం

**70వ జయంతి సందర్భంగా ప్రత్యేక వ్యాసం**

మోహన్ దాస్ కరంచంద్ గాంధీ భారతీయులచే ఆదరింపబడుతున్న ఒక గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు. ప్రజలు ఆయనను జాతిపితగా గౌరవిస్తారు. ఆయన 1869 అక్టోబరు 2న పోరుబందరులో జన్మించారు. నీతి నిజాయితీలకు దర్పణంగా నిలిచిన మన రెండవ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రికూడా అక్టోబరు 2నే జన్మించడం కాకతాళీయం. గాంధీ నమ్మే సిద్ధాంతాలు సత్య, అహింస. సహాయ నిరాకరణ, సత్యాగ్రహము ఆయన ఆయుధాలు. 20వ శతాబ్దిలోని రాజకీయ నాయకులలో అత్యధికంగా మానవాళిని ప్రభావితం చేసిన రాజకీయ నాయకునిగా అనేక సర్వేలు గుర్తించాయి. అన్ని మతాలు, కులాలు ఒకటే అని చాటే ఆ మహాత్ముడు రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించాడు. సత్యాగ్రహము, అహింస పాటించడానికి ఎంతో ధైర్యం కావాలని బోధించాడు. న్యాయవాద విద్యను అభ్యసించిన గాంధీకి 1893లో దక్షిణాఫ్రికాలోని నాటల్‌లోని ఒక న్యాయవాద కంపెనీలో సంవత్సరం కాంట్రాక్టు లభించింది. సంవత్సర కాలపరిమితితో కూడిన ఆ కాంట్రాక్టు కోసం దక్షిణాఫ్రికా వెళ్ళిన గాంధీ





అక్కడే 21 సంవత్సరాలు గడిపాడు. 1914లో గాంధీ భారతదేశానికి తిరిగి వచ్చాడు. భారతదేశంలో స్వాతంత్ర్యోద్యమం అప్పుడే చిగురు వేస్తోంది. భారత జాతీయ కాంగ్రెస్ సమావేశాలలో గాంధీ పాల్గొనసాగాడు. కేవలం తెల్లవాడు కానందువల్ల రైలు బండి మొదటి తరగతిలోంచి నెట్టివేయడం, హోటళ్ళలోకి రానివ్వకపోవడం వంటి జాతి వివక్షతలు ఆయనకు సమాజంలోని అన్యాయాలను కళ్ళకు కట్టినట్లు చూపాయి... వాటిని ఎదుర్కోవలసిన బాధ్యతను గ్రహించి ఎదుర్కొని పోరాడే పటిమను ఆయన నిదానంగా పెంచుకున్నాడు. ఒక విధంగా భారతదేశంలో నాయకత్వానికి ఇక్కడే బీజాలు మొలకెత్తాయి. 1894 లో భారతీయుల ఓటు హక్కులను కాలరాచే ఒక బిల్లును ఆయన తీవ్రంగా వ్యతిరేకించాడు. బిల్లు ఆగలేదు గానీ, ఆయన బాగా జనాదరణ సంపాదించారు. 'ఇండియన్ ఒపినియన్' అనే పత్రికను ఆయన ప్రచురించారు. నిజాయితీ, అహింస, సౌభ్రాతృత్వము అనే సుగుణాలతో కూడిన జీవితం గడపడంలో ఇది ఒక పరిపూర్ణ భాగము. అప్పటి ప్రధాన నేతలలో ఒకరైన గోపాల కృష్ణ గోఖలే గాంధీకి భారత రాజకీయాలు, సమస్యలను పరిచయం చేశాడు. స్వాతంత్రోద్యమంలో ఉక్కుమనిషిగా పేరొందిన సర్దార్ వల్లభాయ్ పటేల్ గాంధీకి కుడి భుజంగా నిలిచాడు. ఇలా ఉద్యమ నాయకుడిగా అవతరించిన గాంధీ దేశ స్వాతంత్ర్య పోరాటంలో అనేక ఉద్యమాలు చేపట్టి, జైలు జీవితం గడిపాడు. జైలులో ఉన్న సమయంలోనే ఆయన కార్యదర్శి మాదవ దేశాయ్, ఆయన సహధర్మచారిణి కస్తూరిబాయి మరణించింది. ఈ క్రమంలో గాంధీ ఆరోగ్యం బాగా క్షీణించింది.

"1948 జనవరి 30వ తేదీ సాయంత్రం 5.17 గంటలకు మహాత్మాగాంధీ ఢిల్లీలోని బిర్లాహౌస్‌లో ప్రార్థనా సమావేశాన్ని ముగించి బయటకు వస్తున్నప్పుడు నాథూరాం గాడ్సే ఆయనకు ఎదురుగా వచ్చారు. అప్పుడు గాంధీ పక్కనే ఉన్న సహచరి ఆచాభటోపాధ్యాయ గాడ్సేను పక్కకు నెట్టివేస్తూ ఆలస్యమైంది, పక్కకు జరగండి అంటూ తోస్తూనే ఉంది. కానీ గాడ్సే పాయింట్ 380 ఏసీపీ, 606824 సీరియల్ నెంబర్ కలిగిన బెరెట్టా ఎం.1934 అనే మోడల్ సెమి - ఆటోమేటిక్ పిస్టల్‌తో గాంధీఛాతిలోకి మూడుసార్లు కాల్చారు. దీంతో బాపూజీ అక్కడికక్కడే కుప్పకూలారు. గాడ్సే కాల్చిన ఒక బుల్లెట్ గాంధీ ఛాతిలోకి దూసుకొని పోగా మిగిలిన రెండు బుల్లెట్లు పొట్ట నుంచి దూసుకెళ్ళాయి. ఢిల్లీ లోని రాజఘాట్‌లో అతని సమాధి ఉంది. గాంధీ ఒక వ్యక్తి కాదు శక్తి.

కాగా లాల్‌బహదూర్ శాస్త్రి 1966లో పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో సైనికులకు స్ఫూర్తినిచ్చే జైజవాన్..జైకిసాన్ అం నినాదాన్ని ఇచ్చారు. రష్యా నేతృత్వంలో రెండు దేశాలు యుద్ధ విరమణను, శాంతి ఒప్పందాన్ని చేసుకునేందు మాస్కోలో సమావే శమయ్యారు. ఒప్పందం అనంతరం ఆయన అనుమానా స్పద రీతిలో మృతి చెందడం భారతీయులను కలచి వేస్తోంది.





**వైఎస్సార్ సీపీ అధినేత జగన్ 3000 కిలో మీటర్ల పాదయాత్ర పూర్తయిన సందర్భంగా వైఎస్సార్‌సీపీ వైద్యవిభాగం ఇన్‌చార్జ్ డా॥ షేక్ మొహబూబ్ ఆధ్వర్యంలో విజయవాడ వించిపేట ప్రభుత్వ జూనియర్ ఉర్దూ కాలేజీ, ఉర్దూ పాఠశాలలో విద్యార్థుల సమక్షంలో కేక్‌కట్ చేశారు. అనంతరం సుమారు 400 మంది విద్యార్థులకు పండ్లను పంపిణీ చేశారు.**

**మీరూ స్పందించండి**

మీరు ఎదుర్కొంటున్న సామాజిక సమస్యలపై స్పందించండి

యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లేందుకు రాజధాని వార్తలు వేదికగా నిలుస్తుంది.

మీరు చేయాల్సిందల్లా సమస్యను ఫోటో తీసి, పరిస్థితిని క్లుప్తంగా వివరించి వాట్సప్ ద్వారా మీ పేరుతో సహా ఈ దిగువ ఉన్న వాట్సాప్ నంబర్లకు పంపించండి.

7680994755

# హంతకుడి కూతురు...

**భవిష్యత్‌పై రంగురంగుల కలలతో అమృత, ప్రణయ్‌లిద్దరూ ఆసుపత్రికి చేతిలో చేయేసుకుని వెళ్లారు. లిప్తపాటులో వారి జీవితం కారుచీకటిగా మారింది. భవిష్యత్‌ను అందంగా మలుచుకోవాలన్న ఆశల స్థానే బ్రతుకు ఛేదించలేని ప్రశ్నగా మారిపోయాంది..తన భర్తమరణానికి తల్లిదండ్రుల కక్షే కారణం కావడంతో అత్తమామల దృష్టిలో ఆమె ఒక హంతకుడి కూతురు.. తమ మాట వినకుండా కులంతక్కువ వాడిని పెళ్లి చేసుకొని తమ బ్రతుకును అపహాస్యం చేసింది కాబట్టి తల్లిదండ్రులు, బంధువుల దృష్టిలో ఆమె ఒక (కుల)ద్రోహి.. ఇది అమృత జీవితం..**

ఆమె





ఆసుపత్రికి ఇద్దరుగా వెళ్లిన ప్రణయ్, అమృతలు ఇంటికి వచ్చే సమయానికి అమృత ఒక్కతే అయిపోయింది. హక్కుగా ప్రణయ్ ఇంట్లో ఉంటున్న అమృత అక్కడే ఉండటానికి అత్తింటి వారిని వేడుకోవాల్సి వచ్చింది. భర్తమరణానికి తల్లిదండ్రుల కక్షే కారణం కావడంతో అత్తమామల దృష్టిలో ఆమె ఒక హంతకుడి కూతురు.. తమ మాట వినకుండా నచ్చిన వాడిని పెళ్లి చేసుకొని తమ బ్రతుకును అపహాస్యం చేసింది కాబట్టి తల్లిదండ్రులు బంధువుల దృష్టిలో ఆమె ఒక కులద్రోహి.. సందర్భాను సారం తలోమాట మాట్లాడే సమాజం దృష్టిలో ఆమె వల్లే ఆమె తండ్రి జైలుపాలయ్యాడని అపనింద.. మొత్తం మీద అమృత జీవితం నడిసముద్రంలో నావ.. ఇప్పుడామే సమాజంతో, తన భవిష్యత్‌తో ప్రతిక్షణం పోరాటం చేయాల్సి వస్తోంది. ఇందుకు కారణం ఎవరు ? ఇప్పుడామె పరిస్థితి ఏంటి ? ఆమెకు ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇస్తామనడం, ఎనిమిది లక్షల నష్టపరిహారం ఇస్తామనడం చాలా మందికి కన్నెర్రగా మారింది. దేశం కోసం మరణించిన సైనిక కుటుంబాలకు కాకుండా ఇలాంటి వారికి ఇవ్వడం ఏమిటని ? ప్రణయ్ విగ్రహాన్ని కట్టిస్తామంటే జాతినాయకుల మధ్య అతని విగ్రహం ఎలా పెడతారంటారు ? అసలు 9వ తరగతిలోనే అమృత ప్రణయ్‌తో ప్రేమాయణం మొదలు పెట్టిందని చీదరించుకుంటారు ? సోషల్ మీడియా వేదికగా అనేక రకాలుగా హింసిస్తున్నారు.. ప్రాణాలను పణంగా పెట్టి సరిహద్దులను అనునిత్యం కాపాలా కాస్తున్న జవాను మృతి చెందితే దేశ ప్రజలు తల్లడిల్లుతారు. వారి కుటుంబాలకు ప్రభుత్వం, అధికారులు ఆలంబనగా నిలవాలనే ఆకాంక్షిస్తారు. అంతేకాని ఎవరూ ఆ కుంటుంబాలను వేధించాలని అనుకోరు. అయితే వారికి అందవలసిన ఆర్థిక ప్రయోజనాల కోసం ఆయా కుటుంబ సభ్యులను అధికారులు వేధిస్తారు. వారి కుటుంబాలకు ఇచ్చే భూములను రాజకీయనాయకులు కబ్జాలు చేస్తుంటారు. ఆ సమయంలో జవానుల కోసం గుండెలు ప్రస్తుతం బాదుకుంటున్న వారంతా ఎక్కడ ఉన్నారు ? జాతి నాయకులంటే ఎవరు ? కులాలకు మతాలకు అతీతంగా భారతీయులనందరినీ ఒక్కటిగా నిలిపిన వారు ..ఇప్పుడు భూతద్దంలో వెతికినా అలాంటి నాయకులు ఎక్కడున్నారు ? కులాలు, ప్రాంతాలు, మతాలను రెచ్చగొట్టి, అవసరమైతే పేదల ప్రాణాలు తీసి ఎదిగిన వారినే కదా నాయకులంటున్నాము.. వారికేకదా.. నడిబజారులో విగ్రహాలు ఆవిష్కరిస్తున్నాం. వారి మధ్య సార్థక నామధేయుడు ప్రణయ్ విగ్రహం ఎందుకంటే నిజమే.. అక్కర్లేదు.. పిల్లలు ఎలా ఉండాలో అని యూట్యూబ్‌ల్లో గంటలు గంటలు లెక్చర్లు ఇచ్చేవారు..ఈ సమాజం ఎటుపోతోంది ? దాని పర్యవసానమేంటి అనేది ఆలోచించకుండా.. దానికి అడ్డుకట్ట వేసే ప్రయత్నం చేయకుండా పిల్లలను పనికిమాలిన సినిమాలు..టీవీలు...స్మార్ట్ ఫోన్లు చూపి, ఆపై తీరిగ్గా హితబోధలు చేసే వారిని ఏమనాలి ? చేతనైతే బాధితురాలికి సాంత్వన చేకూర్చాలి. లేదంటే ఎవడి బ్రతుకు వారు బ్రతకాలి అంతేకాని... అదితప్పు, ఇది రైటు .. అంటూ చెత్తంతా వాగి బాధితులను మరింత వేధింపులకు గురిచేయడం సాటిమనిషిగా చేయకూడని పని. హత్యలను పరోక్షంగా లేదా ప్రత్యక్షంగా సమర్థించడం నేరం .. ఇది ప్రతిఒక్క భారతీయుడు గుర్తుంచుకోవాల్సిన అంశం...

ఇదే ఒక తెలుగు స్టార్ ఇంటిలో జరిగితే ఆ కుటుంబం ఆవ్యక్తిని హత్య చేయలేదు.. ప్రముఖ మానసిక నిపుణుడి వద్ద కౌన్సిలింగ్ ఇప్పించి, ఆమె కేరీర్‌ను ఎంచుకునే విధంగా చేశారు. మనరాష్ట్రానికి చెందిన కేంద్ర మాజీ మంత్రి ఒకరు తనకూతురు ఒక తక్కువ కులం వ్యక్తిని (వారుకూడా ఉన్నత విద్యావంతులు, అత్యున్నత పదవులు నిర్వహించినవారే) ప్రేమిస్తే.. దగ్గరుండి పెళ్లి జరిపించాడు.. ఆ సందర్భంలో ఆమంత్రిగారు ఒకే ఒక్కమాటన్నారు... వాళ్లువచ్చిచెప్పారు. లేదంటే మరో విధంగా ఉండేది.. మనం కూడా గౌరవం నిలబెట్టుకోవాలి కదా.. అని.. అంతకంటే గొప్ప కుటుంబమా మారుతీరావుది ?....

## కాలమ్

### విద్యార్థి ప్రార్థన

ఓ దేవుడా ...ఒక డాలర్ రేటు 70 రూపాయలకు పెంచావు,
పెట్రోలు 90 రూపాయలు కి పెంచావు,
పాలను లీటరుకు 60 రూపాయలకు పెంచావు,
ఉల్లిపాయ రేటును కిలో 80 రూపాయలకు పెంచావు,
కంది పప్పును 160 రూపాయల దాకా పెంచేశావు,
అయినా నీకు కోటి కోటి దండాలు సమర్పిస్తున్నా ఎందుకంటే .......
పాస్ మార్కులు 35 దగ్గరనే ఉంచావు . వాటిని ఏమైనా పెంచి ఉంటే మా గతి ఏమైపోయేది దేవుడా !!!

లాస్ట్ బెంచ్ అసోసియేషన్

### చిన్నారులకు ఉచితంగా గుండె ఆపరేషన్




హాయ్ ఫ్రెండ్స్ విజయవాడ "ఆంధ్రా ఆసుపత్రి"లో నవంబరు-28 నుండి డిసెంబరు-05 తేదీ వరకు ఇంగ్లాండ్ నుండి వస్తున్న 8 మంది వైద్యులచే 18 సంవత్సరముల లోపు చిన్నారులకు ఉచితంగా గుండె ఆపరేషన్ చేయబడును.

సంప్రదించండి : 9494606677, 9494254206

# పీఎన్‌బీ, ఏబీ విలీనం?

**న్యూఢిల్లీ :** నీరవ్ మోడీ దెబ్బకు కుదేలైన పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ)లోకి ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ (ఓబీసీ) ఆంధ్రా బ్యాంకులను కలిపే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు బ్యాంకింగ్ వర్గాలు అంటున్నాయి. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఎస్‌బీఐ తర్వాత పంజాబ్ నేషనల్ బ్యాంకు అతిపెద్దది. ఆర్థికంగా బలంగా ఉన్న ఈ బ్యాంకు కూడా ఎన్‌పీఏల కారణంగా ఘోరంగా దెబ్బతింది. ఈ బ్యాంకును ఇదే విధంగా తీవ్ర నష్టాల్లో ఇరుక్కున మరో రెండు బ్యాంకులను కలపాలని ప్రభుత్వం భావిస్తున్న బ్యాంకింగ్ వర్గాల్లో చర్చ నడుస్తోంది. దివాళా తీసిన గ్లోబల్ ట్రస్ట్ బ్యాంకు (జీటీబీ) ను విలీనం చేశాక ఓబీసీ కూడా కష్టాల్లో పడింది. ఆంధ్రా బ్యాంకు కూడా ఇటీవల కాలంలో నిరర్థక ఆస్తులు పేరుకుపోయి నష్టాలను ఎదుర్కొం టోంది. మరి మూడు నష్టదాయక బ్యాంకుల విలీనం వల్ల కల్గే ప్రయో జనం ఏమిటో మాత్రం సస్పెన్స్‌గా ఉంది. సాధ్యమైనంత వరకు వీఆర్‌ఎస్ ద్వారా ఉద్యోగులను తొలగించడం ప్రభుత్వ లక్ష్యంగా కన్పిస్తోంది.

# అభిలాష్‌ను కాపాడారు

**న్యూఢిల్లీ :** గోల్డెన్ గ్లోబ్ రేస్‌లో భాగంగా ఒంటరిగా ప్రపంచయానం చేస్తూ హిందూమహా సముద్రంలో ప్రమాదానికి గురైన కేరళకు చెందిన నేవీ కమాండర్ అభిలాష్ టామీ(39)ను విజయవంతంగా రక్షించారు. ఆస్ట్రేలియాలోని పెర్త్‌కు 1,900 నాటికల్ మైళ్ల దూరంలో ప్రమాదంలో చిక్కుకున్న ఆయన్ను రక్షించేందుకు భారత్, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్ యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. అభిలాష్ పడవ 'తురయా' వద్దకు చేరుకున్న ఫ్రెంచి మత్స్యకార పడవ 'ఒసిరిస్' సిబ్బంది ఆయన్ను రక్షించింది. ఈ విషయం తెలిసి తాము టెన్షన్ నుంచి బయటపడ్డామని రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. ఆయన ప్రస్తుతం క్షేమంగా ఉన్నారు. ఒసిరిస్‌లో దగ్గర్లోని ఇల్ ఆమ్‌స్టర్‌డాం దీవికి, అక్కడి నుంచి 'ఐఎన్‌ఎస్ సాత్పురా' లో మారిషస్ తీసుకువచ్చి, అవసరమైన వైద్య చికిత్సలు చేయిస్తాం' అని మంత్రి ట్విటర్‌లో పేర్కొన్నారు.





పశ్చిమ ఆస్ట్రేలియా తీరానికి 3,200 కిలోమీటర్ల దూరంలో ఆయన చిక్కుకుపోయిన అభిలాష్‌కు 39 ఏళ్లు. జలమార్గంలో ప్రపంచాన్ని చుట్టి వచ్చిన తొలి భారతీయుడిగా ఆయన 2013లో రికార్డు నెలకొల్పారు. గోల్డెన్ గ్లోబ్ రేస్‌లో శాటిలైట్ కమ్యూనికేషన్లు మినహా ఎలాంటి ఆధునిక టెక్నాలజీనీ ఉపయోగించకుండా పోటీదారు 48,280 కిలోమీటర్ల దూరం యాచ్‌లో ప్రయాణించి ప్రపంచాన్ని చుట్టేయాల్సి ఉంటుంది. ఈ పోటీలు జులై 1న ఫ్రాన్స్ నుంచి ప్రారంభమైంది. ఇప్పటివరకు ఏడుగురు పోటీదారులు రేస్ నుంచి విరమించుకున్నారు. 1968 గోల్డెన్ గ్లోబ్ రేస్ విజేత రాబిన్ నాక్స్-జాన్‌స్టన్‌కు చెందిన సుహైలీని నమూనాగా తీసుకొని అభిలాష్ పడవ 'తూరియా'ను తయారు చేశారు

హిందూ మహాసముద్రంలో వచ్చిన తీవ్రమైన తుపానులో 'తూరియా'లో తెరచాపకు ఆధారంగా నిలిచే మాస్ట్ దెబ్బతింది. భారీ తుపానుతో గంటకు దాదాపు 130 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. 45 అడుగుల ఎత్తున అలలు ఎగసిపడ్డాయి. అభిలాష్ ఒక టెక్స్టింగ్ యూనిట్ సాయంతో సమాచారాన్ని పంపించగలిగారు. ఆయన శాటిలైట్ ఫోన్ పగిలిపోయింది. "బోటులో సురక్షితంగానే ఉన్నాను. నడవడం చాలా కష్టంగా ఉంది. స్ట్రెచర్ అవసరం కావొచ్చు" అని సందేశం పంపారు. అత్యవసర పరిస్థితుల్లో అక్కరకొచ్చే వస్తువులున్న ఒక బ్యాగు అభిలాష్ యాట్‌లో ఉంది. అందులో ఇంకో శాటిలైట్ ఫోన్ ఉంది. కానీ ఆ బ్యాగు వద్దకు ఆయన చేరుకోవడం కష్టమైంది. అభిలాష్ వెన్నుకు తీవ్రమైన గాయం కావడంతో కదల్లేకపోయారు. ఆహారం, నీరు కూడా తీసుకోలేక నానాయాతన పడ్డారు. ప్రస్తుతం ఆయనకు మెరుగైన చికిత్స అందుతోంది.

## రాజధాని క్లాసిఫైడ్స్

### నివాస ప్లాట్లు

**నవులూరు**
రాజధాని ప్రాంతంలోని నవులూరు గ్రామ పరిధిలో 500, 1000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ :9440662699

**రాయపూడి**
రాజధాని ప్రాంతంలోని రాయపూడి గ్రామ పరిధిలో 500, 1000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9908244333

నీరుకొండ
రాజధాని ప్రాంతంలోని నీరుకొండ గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9440662699

### ఇతరములు

ఓంశ్రీ సాయిరాం రిజిస్ట్రేషన్ కన్సల్‌టెన్సీ & సర్వీసెస్ అన్ని రకముల దస్తావేజులు, అగ్రిమెంట్లు వ్రాయబడును. స్టాంపులు అమ్మ బడును. అన్ని రకముల మోటారు వాహనములకు ఇన్సూరెన్స్ కట్టించు కొనబడును.
**పాపన చక్రవర్తి డాక్యుమెంట్ రైటర్**
ఫోన్ 9502424704, 08645 244992
సబ్ - రిజిస్ట్రార్ ఆఫీస్ ఎదురు, తుళ్లూరు

**వెంకటపాలెం**
సాయిలాస్య రియల్‌ఎస్టేట్ & ఫైనాన్స్ కన్సెల్టెన్సీ, గాదె నాగేశ్వరరావు
ఫోన్ : 95151 53939

**మందడం**
ఎస్.ఆర్.కె. గ్రాండ్ రెస్టారెంట్
ఫోన్ : 9553023388

**వెలగపూడి**
సాయి గణేష్ ట్రెడర్స్: నిర్మాణ రంగానికిసిమెంట్, స్టీలు, పైపులు, పెయింట్‌లు అమ్మబడును.
ఫోన్ : 9640811333

**రాయపూడి**
కాకతీయ ఫుడ్ కోర్ట్
ఫోన్ 9848021898

**రాయపూడి**
రియల్‌ఎస్టేట్ క్రయ, విక్రయాలకు సంప్రదించడం న్యూసింగపూర్ రియల్ ఎస్టేట్
ఫోన్ : 98484 42436

**రాయపూడి**
చంద్రిక ట్రెడర్స్ నిర్మాణ రంగానికి సిమెంట్, స్టీలు,పైపులు అమ్మబడును.
ఫోన్ : 9908073516

### షాప్స్

**తుళ్ళూరు**
రేమాండ్స్‌ట్రైలర్స్
ఫోన్ : 9492470426

**తుళ్ళూరు**
వైభవ్ డ్రస్సెస్
ఫోన్ : 9848407935

**తుళ్ళూరు**
రాజా గోల్డ్ కవరింగ్
ఫోన్ : 9581500500

**తుళ్ళూరు**
శ్రీసాయి జ్యూయలరీ వర్క్స్
ఫోన్ :9247171083

**తుళ్ళూరు**
ఎస్.ఎమ్(స్టైల్ ఫర్ మెన్) ట్రైలర్స్
ఫోన్ 9440307123

**రాయపూడి**
ఖాజా ఖాదర్ రైస్ స్టోర్స్
ఫోన్ : 9603990791

**రాయపూడి**
వర్షిత ఫోటోస్టాట్
ఫోన్ : 9985853188

### హస్పటల్స్

**విజయవాడ**
ఆంధ్ర హస్పటల్, డా॥శ్రీమన్నారాయణ
ఫోన్ : 9177219900

**విజయవాడ**
న్యూఫేస్ కీనిక్ , డా॥మేహబూబ్
ఫోన్ : 9849122788

**విజయవాడ**
అష్రఫ్ మెటర్నిటీ & ఇ,ఎన్‌టి డా॥ రెహమాన్
ఫోన్ : 0866-2475087

**విజయవాడ**
శ్రీమానస సైకియాట్రిక్ డా॥ అయోధ్య ఆర్.కె
ఫోన్:0866-2436647

విశాఖపట్నం
చింతలూరు ఆయుర్వేద డా॥ విశ్వనాథ్
ఫోన్ :90329 90138

### వాణిజ్య ప్లాట్లు

**నవులూరు**
రాజధాని ప్రాంతంలోని నవులూరు గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9440662699

**ఐనవోలు**
రాజధాని ప్రాంతంలోని ఐనవోలు గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9908244333

నీరుకొండ
రాజధాని ప్రాంతంలోని నీరుకొండ గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9440662699

### విద్యా సంస్థలు

ఐనవోలు
విఐటీ-ఏపీ యూనివర్శిటీ
ఫోన్ :0863 2370444

నీరుకొండ
ఎస్ఆర్‌ఎమ్ యూనివర్శిటీ
ఫోన్ :0863 2343000

**గమనిక : క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిముల‌తో ఈ వార్తాపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.**

**- మేనేజర్**

ప్రకటనలకు సంప్రదించండి 7680994755

## రియల్ లైఫ్ ఆఫ్ పై

**జకార్తా :** చైనా ఆస్కార్ అవార్డు గ్రహీత రూపొందించిన సినిమా లైఫ్ ఆఫ్ పై చూశారా ? దానిలో కుటుంబం అంతా సముద్రంలో చిక్కుకొని మరణిస్తే ఒకడే సముద్రంలో ప్రయాణించి ఒడ్డుకు చేరుకునే కథతో ఈ సినిమాను నిర్మించారు. ఇలాంటి రియల్ ఘటన జకర్తాలో జరిగింది.

సముద్రం మధ్యలో చెక్క ఇంట్లో పనిచేస్తున్న టీనేజీ పిల్లాడు అడిలాంగ్ చెక్కఇంటితోసహా సముద్రంలోకి అలలధాటికి 2,500 కిలోమీటర్ల దూరం కొట్టుకుపోయాడు. పసిఫిక్ మహాసముద్రంలో ఎట్టకేలకు 49 రోజుల తర్వాత ఆ పిల్లాడిని రక్షించగలిగారు. ఇండోనేషియాలోని సులవెసి ద్వీపం దగ్గర్లో జరిగిందీ ఘటన. ఒక్కడే నడిసముద్రంలో 49 రోజులున్న అడిలాంగ్ ఆకలి తీర్చుకునేందుకు చేపలు వేటాడి తిన్నాడు. దాహమేస్తే సముద్ర పునీటిలో బట్టలు తడిపి పిండి తాగేవాడు. అటుగా వెళ్తున్న పనా మా దేశానికి చెందిన ఓ పడవ బృందం ఇతడిని కాపాడింది. ఇన్ని రోజులైనా పిల్లాడు ఆరోగ్యంగానే ఉండటం విశేషం.

## 4న కాంగ్రెస్ అభ్యర్థుల తొలి జాబితా

**హైదరాబాద్ :** కేసీఆర్ ఏం చేశారని నల్గొండలో సభ పెడుతున్నారని కాంగ్రెస్ నేత కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రశ్నించారు. కేసీఆర్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. టీఆర్‌ఎస్ సభకు ధీటుగా కాంగ్రెస్ కూడా సభ పెట్టనుందని తెలిపారు. వచ్చే నెల 4న కాంగ్రెస్ అభ్యర్థుల తొలి జాబితా ప్రకటిస్తారని వెల్లడించారు. మహాకూటమి సీట్లపైనా కూడా త్వరలో స్పష్టత వస్తుందన్నారు. ప్రజా మేనిఫెస్టో కోసం జిల్లాల్లో పర్యటిస్తామని పేర్కొన్నారు. రాజగోపాల్‌రెడ్డి వివాదం సమసిపోయినట్లేనని తాను భావిస్తున్నట్లు చెప్పారు. ఎస్‌ఎల్‌బీసీ నిధులనూ కాళేశ్వరానికి మళ్లించారని కోమటిరెడ్డి ఆరోపించారు.

## ముఖేష్ సంపాదన రోజూ రూ.300కోట్లు

**న్యూఢిల్లీ :** భారతీయ అత్యంత ధనవంతుల్లో ఒకరైన రిలయన్స్ ఇండస్ట్రీస్ అధిపతి ముఖేష్ అంబానీ రోజు సంపాదన రూ.300 కోట్లు అని బర్కేస్ హరూన్ ఇండియాస్ రిచెస్ట్ లిస్ట్ 2018 ప్రకటించింది. ఆయన మొత్తం సంపద విలువ రూ.3,71,000 కోట్లు అని ప్రకటించింది. ముఖేష్ అంబానీ వరుసగా ఏడో సంవత్సరం అత్యంత సంపన్నుల్లో టాప్ పొజిషన్ లో నిలబడ్డారు. ఈ ఏడాది 45శాతం తన కంపెనీ షేర్ ధర పెరిగింది.



ముఖేష్ సంపద అతని తర్వాతి స్థానంలోని ముగ్గురి సంపద కంటే ఎక్కువ అని ప్రకటించింది. అతని తర్వాతి స్థానంలో ఎస్పీ హిందూజా కుటుంబం (రూ.1,59,000కోట్లు), ఆ తర్వాత ఎల్ ఎన్ మిట్టల్ కుటుంబం (రూ.1,14,500కోట్లు), అనంతరం అజీమ్ ప్రేమ్ జీ (రూ.96,100కోట్లు). సన్ ఫార్మా దిలీప్ సంఘ్వీ భారతీయ సంపన్నుల్లో లిస్ట్ లో ఐదో స్థానంలో నిలిచారు. ఆయన కంపెనీ షేర్ ఈ ఏడాది సుమారు 50% పడిపోయింది. 2018 ఏప్రెల్ లో సంఘ్వీ యునిచెమ్ లాబోరేటరీస్ లో 3.8% స్టేక్ కొన్నారు. బర్కేస్ హరూన్ ఇండియాస్ రిచెస్ట్ లిస్ట్ 2018 లో 66మంది ఎన్నారైలు చోటు సంపాదించారు.

## 100 దాటితో బంకులు మూతే..?

పెట్రో ధరలు శరవేగంగా పరుగులు పెడుతున్నాయి. సెంచరీ దిశగా అడుగులు వేస్తున్నాయి. రోజురోజుకీ ధరలు పెరుగుతుండడంతో సెంచరీ ఖాయమని పలువురు సెటైర్లు వేస్తున్నా.. అది మాత్రం ఆచరణ సాధ్యం కాదని పెట్రోల్ బంకుల యజమానులు చెబుతున్నారు. పెట్రోల్ రేట్ల డిస్‌ప్లే మేషీన్లు 99.99 కంటే అధిక సంఖ్యను చూపించలేదని తేల్చేశారు. మూడు రోజుల క్రితం 'పవర్ 99' ఆక్టేన్ పెట్రోల్ ధర్ 100.33 కి చేరగా.. డిస్‌ప్లే మెషీన్‌లో రూ.33గా చూపించిందని చెప్పారు.

గత ఏడాది నుంచి పవర్ 99 పేరుతో హెచ్‌పీసీఎల్ ఆక్టేన్ పెట్రోల్‌ను విక్రయిస్తోంది. సాధారణ పెట్రోల్ కంటే ఈ పవర్ 99 పెట్రోల్ ధర లీటర్‌కు రూ.20 అధికం. మూడు రోజుల క్రితం ఈ పవర్ 99 రకం పెట్రోల్ ధర రూ.100.33కి చేరినప్పుడు పెట్రోల్ బంకుల యజమానులు అమ్మకాలు నిలిపివేశారు. పెట్రోల్ బంకుల్లోని డిస్‌ప్లే మెషీన్లన్నీ సెంట్రల్ సర్వర్‌కు అనుసంధానం చేసి ఉంటాయి. అక్కడి నుంచి తప్ప ఈ మెషీన్లలోని అంకెలను మర్చలేం.




## వెల్లంపల్లితో సీటు పోయేనా?

(మొదటిపేజీ తరువాయి)

దాడులు చేయించారనే ఆరోపణలు ఉన్నాయి. జగన్ దీనిపై స్పందించి వెల్లంపల్లిని మందలించారని సమాచారం. గతంలో ఆయన కాంగ్రెస్ ఎమ్మెల్యేగా పనిచేసినప్పుడు కూడా తన సామాజికవర్గాన్ని మాత్రమే దగ్గరకు తీసుకున్నారనే ప్రచారం ఉంది. పార్టీలు మారుతున్న నేతలకు ఏ పార్టీ అయినా సీటు ఇచ్చే ముందు ఆలోచన చేస్తే బాగుంటుందని ఆ ప్రాంత ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. **పశ్చిమ నియోజకవర్గంలో ముస్లీములు, జైన్‌లు అధికంగా ఉన్నారు. దీంతో ముస్లిం ఓట్లు ఎక్కువగా ఉన్న ఈ ప్రాంతంలో అదే సామాజిక వర్గానికి చెందిన మరొక అభ్యర్థిని నిలబెట్టాలని వారు కోరుతున్నారు.** గతంలో కూడా ముస్లిం అభ్యర్థిని బరిలో ఉంచడం వల్లే కృష్ణాజిల్లాలో వైసీపీ సీట్లు తక్కువ అయిన ప్పటికీ పశ్చిమ ఎమ్మెల్యేగా ముస్లింను విజ యం సాధించడాన్ని వారు పార్టీ అధినేతలకు గుర్తు చేస్తున్నారు. ఏది ఏమైనా విజయవాడ పశ్చిమ నియోజవర్గంలో 2019 ఎన్నికలు రసవత్తరంగా ఉంటాయన్నది మాత్రం వాస్తవం.

## ఈ-ప్రగతిపై సీఎం చంద్రబాబు సమీక్ష



**రాజధాని వార్తలు, అమరావతి :** ఈ-ప్రగతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇన్నోవేషన్ హ్యాక్‌థాన్, ఆర్టీజీ, ఫైబర్‌గ్రిడ్, ఐవోటీపైనా సమీక్ష జరిగింది. మనం ఏంచేస్తున్నామనేది యూఎన్‌వో వేదికగా ప్రపంచానికి తెలియజేశానని తెలిపారు. రియల్ టైమ్‌లో భూగర్భజలాలు, వర్షపాతం, వాతావరణ పరిస్థితులు, జలవనరుల వివరాలు తెలుసుకోవడం అంతా ఆసక్తిగా గమనిస్తున్నారన్నారు. ఏపీ ఆర్థికరంగంలో నాలుగో పారిశ్రామిక విప్లవం ప్రభావాన్ని ప్రపంచ బ్యాంకు అధ్యయనం చేసిందని చెప్పారు. ఇన్నోవేషన్‌ను అన్ని రంగాల్లో అమలుజేస్తున్నామని చంద్రబాబు పేర్కొన్నారు.







# రాఫెల్ రగడ

భారత్‌కు సరిహద్దు దేశాల నుంచి యుద్ధ ముప్పు పొంచి ఉండటంతో భారత్ వాయుసేన వద్ద ఉన్న యుద్ధ విమానాలను ఆధునికీకరించాలని భావించింది. 2012లో యూపీఏ ఇందుకు సంబంధించి బిడ్లను ఆహ్వానించింది. అమెరికా, యూరప్, రష్యా తదితర దేశాల నుంచి పలు బిడ్లు వచ్చాయి. వాటిలో ఫ్రాన్స్‌కి చెందిన ప్రైవేటు కంపెనీ డసౌ ఆధ్వర్యంలోని రాఫేల్‌ను ఎంపిక చేశారు రాఫేల్ నుంచి టెక్నాలజీ, ఇతర విడి భాగాలను భారత్‌కు తీసుకొచ్చి బెంగళూరులో ఉన్న ప్రభుత్వ అధీనంలోని హిందుస్తాన్ ఎరోనాటిక్స్ లిమిటెడ్‌లో (హాల్) 108 యుద్ధ విమానాలను అసెంబుల్ చేయాలని నిర్ణయించారు. దీని ప్రకారం ఫ్రాన్స్ సంస్థ డసో, దాని ప్రధాన భాగస్వాములైన ఇంజిన్ మేకర్ సఫ్రాన్, ఎలక్ట్రానిక్ సిస్టమ్స్ తయారీ దారు తమ టెక్నాలజీని డీఆర్డీవో, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్)తో పంచుకుంటానికి ఒప్పందం జరిగింది.

2014లో భారత్‌లో మోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. యూపీఏ నిర్ణయానికి భిన్నంగా ఎగరడానికి సిద్ధంగా ఉన్న 36 విమానాలను నేరుగా రాఫెల్ నుంచి కొనుగోలు చేయాలని 2015లో నిర్ణయించింది. దీంతో అక్కడి టెక్నాలజీని కొని దేశీయంగా హాల్‌లో యుద్ధ విమానాల అసెంబ్లింగ్ ఆలోచనను కేంద్ర ప్రభుత్వం విరమించుకుంది. 2016 సెప్టెంబరులో ఫ్రాన్స్‌తో ఒప్పందంపై మోడీ సంతకం చేశారు. ఈ ఒప్పందం ప్రకారం.. రఫేల్‌కి రూ.58వేల కోట్లు చెల్లించాలి. రఫేల్ 36 యుద్ధ విమానాలు అందిస్తుంది. మొత్తం రూ.58వేల కోట్లలో 15 శాతం నిధులను భారత్ రాఫెల్‌కి ముందస్తుగా చెల్లించాలి. విమానాలతో పాటు మీటియర్ మిసైల్స్ సహా పలు అత్యాధునిక ఆయుధాలను భారత్‌కి రాఫెల్ అందిస్తుంది. భారత వాయుసేన పరిశోధన కార్యక్రమాల్లో రాఫెల్ 30 శాతం పెట్టుబడులు పెడుతుంది. స్థానికంగా భారత్‌లో తయారు చేసే రాఫెల్ విమానాల కోసం 20 శాతం నిధులు వెచ్చిస్తుంది. ఈ నిధులు మొత్తం రూ.58వేల కోట్లలో భాగంగా ఉంటాయి. రాఫెల్ తమ భారత భాగస్వామిగా అనిల్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ డిఫెన్స్ లిమిటెడ్‌తో జతకట్టింది.

2012లో యూపీఏ జరిపిన బేరసారాలతో పోల్చితే ఇప్పుడు ఒక్కో యుద్ధ విమాన ధరను మూడు రెట్లకు 16000కు పెంచడం దేశవాసులను దిగ్భ్రాంతికి గురి చేసింది. మొట్టమొదటి రాఫేల్ విమానం భారత్‌కు 2019 చివరలో చేరుతుంది. మిగతా 35 రఫేల్ విమానాలు 60 నెలల వ్యవధిలో వస్తాయి. వీటిలో 28 సింగిల్ సీట్ విమానాలు కాగా, 8 విమానాల్లో రెండు సీట్లు ఉంటాయి. యుద్ధ విమానాల ధరతోపాటు, రిలయన్స్ గ్రూప్ పాత్రతో ఇందులో భారీ కుంభకోణం ఉందని ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతున్నాయి. ప్రజాధన దుర్వినియోగం, దేశభద్రతను ప్రమాదంలో పడేయడం, పక్షపాతం, నిబంధనలను ఉల్లంఘించిన అంశాలపై దర్యాప్తు చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఒక విమానాల కొనుగోలు ప్రకటనకు 12 రోజుల ముందు ఏర్పడిన ఫైటర్ విమానాల తయారీలో ఏమాత్రం అనుభవం లేని రిలయన్స్ డిఫెన్స్ లిమిటెడ్‌కు ప్రధాని డీల్ ఎలా అప్పగిస్తారంటూ ప్రశ్నిస్తున్నాయి. ఇదే సమయంలో భారత్ – ఫ్రాన్స్ మధ్య జరిగిన రాఫెల్ యుద్ధ విమానాల ఒప్పందంపై భారత ప్రభుత్వం సూచనతో వేరే దారి లేక రిలయన్స్‌ను భాగస్వామిగా ఎంచుకున్నామని ఫ్రాన్స్ మాజీ అధ్యక్షుడు హోల్లాండ్ చెప్పినట్టు ఫ్రాన్స్ పత్రికలు తెలిపాయి. మొదట 126 విమానాల కొనాలనుకున్నారు.. అయితే ప్రభుత్వం మారడంతో భారత్ తమ ప్రతిపాదనను మార్చింది. 36 విమానాలు మాత్రమే చాలంటూ, తయారీ మాత్రం ఫ్రాన్సులోనే జరగాలంది. అంతకుముందు ప్రతిపాదనతో పోలిస్తే, ఒక రకంగా తాము నష్టపోయినా, మరో విధంగా లాభం పొందాం అని హోల్లాండ్ అన్నారని ఆ పత్రిక పేర్కొంది.

హోల్లాండ్ భార్య జూలీ గయెట్ భాగస్వామ్యంతో కెవ్ ఆడమ్స్ హీరోగా సినిమా తీస్తున్నట్టు 2016, జనవరి 24న రిలయన్స్ సీఈఓ అనిల్ అంబానీ పత్రికా ప్రకటన విడుదల చేసేవరకూ అంతా సాధారణంగానే ఉంది. అదే రోజు హోల్లాండ్ మూడు రోజుల పర్యటన కోసం భారత్ వచ్చారు. దీనిపై ఆయనను మీడియా ప్రశ్నించింది..హోల్లాండ్ దీనిపై స్పందిస్తూ,. సినిమా నిర్మాణానికి రాఫెల్ ఒప్పందానికి సంబంధం లేదని కొట్టిపారేశారు. మొదట తమ దేశానికి చెందిన డసౌ కంపెనీకి రిలయన్స్ కంపెనీతో పనిచేయడం ఇష్టంలేదని అయితే భారత ప్రభుత్వం నిర్ణయం మేరకు మాత్రమే దీనిని అంగీకరించాల్సి వచ్చిందని ఆయన స్పష్టం చేసినట్టు అక్కడి విలేకరికి ఆయన స్పష్టం చేశారని పత్రికలు ప్రచురించాయి.

రాఫెల్ ఒప్పందంపై భారత్‌లో జరుగుతున్న పరిణామాలపై ఫ్రాన్స్ అధ్యక్షుడిని ఇంటర్వ్యూచేసిన అంటాన్ రోగెట్‌ను భారత పత్రికలు ఈమెయిల్ ద్వారా ఇంటర్వ్యూ చేయగా, రిలయన్స్ కంపెనీని భారత్ సూచిందనే చెప్పారని ఆయన కూడా స్పష్టం చేశారు. దీంతో అంతవరకు రిలయన్స్‌ను ఫ్రాన్స్‌కు చెందిన దసౌ కంపెనీ ఎన్నిక చేసిందన్న భారత నేతలకు గొంతులో పచ్చివెలగ పడగా, దీనిపై నిగ్గు తేల్చాల్సిందేనని ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి.

– బోస్

## రాఫెల్ ఒప్పందంపై రాహుల్ ఫైర్




ప్రధాని నరేంద్రమోడీ, రిలయన్స్ అధినేత అనిల్ అంబానీ రక్షణదళాలపై 1,30,000 కోట్ల రూపాయల మెరుపు దాడి చేశారని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు. భారతమాతకు వెన్నుపోటు పొడిశారనికూడా ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఒప్పందంతో రిలయన్స్‌కు లబ్ధిచేకూర్చేవిధంగా ప్రధాని వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు.

## ఉన్నతాధికారి అభ్యంతరం

ఫ్రాన్స్ నుండి 36 రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందంపై సంతకాలు జరగటానికి నెల రోజుల ముందే రక్షణ శాఖ తన అభ్యంతరాలను అధికారికంగా ప్రభుత్వానికి నివేదించినట్లు ఆ శాఖ సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. 2016 సెప్టెంబర్‌లో అప్పటి రక్షణ మంత్రి మనోహర్ పారిక్కర్, ఫ్రెంచ్ రక్షణ మంత్రి ఈ ఒప్పందంపై సంతకాలు చేసిన విషయం తెలిసిందే. కాగా అప్పటి కాంట్రాక్ట్ చర్చల కమిటీలో సభ్యుడిగా ఉన్న ఈ అధికారి రాఫెల్ ఒప్పందంలో పేర్కొన్న విమాన ధరలపై తన అభ్యంతరాలను అధికారికంగా నమోదు చేసి ప్రభుత్వానికి పంపినట్లు తెలుస్తోంది. అప్పట్లో రక్షణ మంత్రిత్వశాఖలో జాయింట్ సెక్రెటరీ, అక్విజిషన్ మేనేజర్ (ఎయిర్) హోదాలో వున్న ఈ అధికారి తన అభ్యంతరాలను నమోదు చేసిన నోట్‌ను కేబినెట్ ఆమోదానికి పంపారు. ఈ అభ్యంతరాలతో రఫెల్ ఒప్పందంలో కొంత జాప్యం జరిగిన మాట వాస్తవమేనని, ఈ అభ్యంతరాలను మరో సీనియర్ అధికారి డైరెక్టర్ జనరల్ (అక్విజిషన్) కొట్టిపారేసిన తరువాత మాత్రమే ఒప్పందంపై సంతకాలు జరిగాయని ప్రభుత్వ వర్గాలు వివరించాయి. కాగా అభ్యంతరాలు వ్యక్తం చేసిన అధికారి ఆ తర్వాత ఉద్యోగం చేయలేక సెలవుపై వెళ్లారు. రాఫెల్ విమానాల కొనుగోలు ఒప్పందంపై రాజకీయ దుమారం రేగిన ప్రస్తుత సమయంలో ఈ ఒప్పంద పత్రాలను పరిశీలిస్తున్న కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) చేతికి ఈ అభ్యంతరాల నోట్ కూడా వెళ్లింది. ఈ ఒప్పందంపై కాగ్ తన నివేదికను పార్లమెంట్ శీతాకాల సమావేశాల సమయంలో డిసెంబర్‌లో ప్రభుత్వానికి అందచేయవచ్చని తెలుస్తోంది. రాఫెల్ విమానాల కొనుగోళ్లను తొలుత సమర్ధించిన వాయుసేన సైతం ఈ అధికారి ప్రతిపాదనను సమర్ధించినట్లు తెలుస్తోంది.

## బహుముఖప్రజ్ఞాశాలి,సంఘసంస్కర్త రఘుపతివెంకటరత్నం నాయుడు కాంశ్యవిగ్రహం

**(అక్టోబరు 1న మచిలీపట్నం కాంశ్య విగ్రహం ఏర్పాటు)**



రఘుపతి వెంకటరత్నంనాయుడు బహు ముఖ ప్రజ్ఞాశాలి, సంఘసంస్కర్త, ఆయన నిరుపమాన సేవలను గుర్తించిన ఆనాటి ఆంగ్లేయ ప్రభుత్వం ఆయనకు " రాజ బహదూర్, 'దివాన్ బహదూర్,' 'సర్" ఇంటి బిరుదులతో సత్కరించి, గౌరవించింది. మద్రాసు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఒక ఆంధ్రుడు నియమితులు కావటం తెలుగు వారికి గర్వకారణం.

1862 అక్టోబరు 1న రఘుపతి వెంకటరత్నం నాయుడు మచిలీపట్నంలో జన్మించారు. తండ్రి అప్పయ్య నాయుడు, తల్లి శేషమ్మ. అప్పయ్య నాయుడు ఉత్తర భారతంలో సుబేదరుగా పని చేసేవారు. తల్లి విష్ణు భక్తురాలు. వెంకటరత్నం నాయుడు జననం మచిలీపట్నం అయినా, బాల్యం తండ్రి ఉద్యోగం నిర్వహిస్తున్న ప్రాంతంలోనే గడిచింది. అందు వల్ల హిందీ, ఉర్దూ భాషలపై మంచి పట్టువుంది. తండ్రి అప్పయ్య హైదరాబాదుకు బదిలీ జరగటంతో నిజాం ఉన్నత పాఠశాలలో అఘోరనాథ చటోపాధ్యాయ వద్ద చదివి మెట్రిక్ పాసయ్యారు. (అఘోరనాథ చటోపాధ్యాయ సరోజినీ నాయుడి తండ్రి). అనంతరం మద్రాసు క్రిష్టియన్ కళాశాలలో చదివి 1885లో పట్టభద్రులయ్యారు. 1891లో ఎం.ఎ. 1897లో ఎల్.టి. డిగ్రీల నందుకున్నారు.


భావితరాలకు విజ్ఞానం అందించాలనే దృష్టితో నాయుడు ఉపాధ్యాయ వృత్తి స్వీకరించాడు. ఏలూరు, రాజమండ్రి, సికింద్రాబాదు, చెన్నై, మచిలీపట్నలలో ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూనే 'బ్రహ్మధర్మం' ప్రచారం ప్రారంభించారు. అందుకోసం "బ్రహ్మ పత్రిక" అనే పత్రికను కూడా నిర్వహించారు. 1905లో కాకినాడలోని పిఠాపురం రాజా కళాశాలలో ప్రిన్సిపాల్‌గా చేరారు. మహిళావిద్యకు, హరిజన విద్యార్థులకు కళాశాలలో ప్రవేశించడానికి అవకాశాలు కల్పించారు. 1925 వరకు అక్కడే బాధ్యతలు నిర్వర్తించిన రఘుపతి వెంకటరత్నం నాయుడు పేద విద్యార్థులు చదువు కోటానికి, విద్య విధానాలు మెరుగు కావటానికి అనేక పథకాలు రూపొందించి, అమలు పరచారు. 1925లో మద్రాసు విశ్వవిద్యాలయం ఉపకులపతి గా నియమితులై 1928 వరకు కొనసాగారు. మద్రాసు విశ్వవిద్యాలయం ఉపకుల పతిగా పనిచేసిన మొదటి ఆంధ్రాకు ఆయన శాసన మండలి సభ్యులుగా పనిచేస్తున్న రోజుల్లోనే మద్రాసు రాష్ట్ర శాసన మండలిలో " మద్యపాన నిషేధం" బిల్లును ప్రవేశ పెట్టారు. నాయుడు గారి 27వ ఏటనే వారి సహ ధర్మచారిణి మరణించారు. ఆనాటి నుంచి ఆయన తెల్ల బట్టలే ధరించటం మొదలెట్టారు. ఆయన తెల్లదుస్తులే ధరించటం వల్ల " ఆంధ్రా శ్వేతాంబర్ రూపి" అని పిలిచే వారు. " బ్రహ్మప్రకాశిక, ద ఫెలో వర్కర్, పీపుల్స్ ఫ్రెండ్" అన్న ఆంగ్ల పత్రికలకు సంపాదకత్వం వహించాడు. 1905 అఖిల భారత ఆస్తిక మండలి అధ్యక్షులుగా ఎన్నికయ్యాడు. 1927లో ఆంధ్రా విశ్వకళాపరిషత్ ప్రథమ పట్టాప్రదానోత్సవంలో " గౌరవ డాక్టరేట్" బ్రిటిష్ ప్రభుత్వం ఆయనను సత్కరించింది. సుదీర్ఘకాలం ప్రజా సేవలందిచిన రఘుపతి వెంకటరత్నం నాయుడు 1939 మే 26న స్వర్గస్తులయ్యారు.

మహిళావిద్య, షెడ్యూలుకులాల వారికి కళాశాల విద్యలో ప్రవేశం, లెక్కనేనంతమంది పేద విద్యార్థులకు ఫీజులు కట్టిన ఆదర్శమూర్తి రఘుపతి వెంకటరత్నం నాయుడు. వారి నిస్వార్థ సేవలను భవిష్యత్ తరానికి అందించటానికి " అమెరికన్ ప్రోగ్రసివ్ తెలుగు అసోసియేషన్ " నడుం బిగించింది. వారి జయంతి రోజున, వారి జన్మస్థలమైన మచిలీపట్నంలో రఘుపతి వెంకటరత్నం నాయుడు గారి కాంశ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయటం హర్షదాయకం, అభినందనీయం.

– దాసరి ఆళ్వార స్వామి

## త్వరలో భారత్‌కు పుతిన్

**క్షిపణి, యుద్ధనౌకల ఒప్పందాలపై సంతకాలు..!**




**న్యూఢిల్లీ :** రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వచ్చే వారం భారత్‌లో పర్యటించనున్నారు. ఉపరితలం నుండి గగనతలానికి ప్రయోగించగల ఎస్400 క్షిపణి వ్యవస్థలను భారత్‌కు సరఫరా చేయడానికి రష్యా ఒప్పందంపై సంతకాలు చేయనుందని రష్యన్ అధికారి తెలిపారు. రష్యా ఆయుధాలు కొనుగోలు చేసేవారిపై ఆంక్షలు విధిస్తామని అమెరికా చేసిన బెదిరింపు ఈ ఒప్పందంపై ఎలాంటి ప్రభావాన్ని చూపదని ఆ అధికారి స్పష్టం చేశారు. 620కోట్ల డాలర్ల విలువ చేసే ఈ ఒప్పందం కింద 10 బ్యాటరీలు సరఫరా చేయనున్నారు. అక్టోబరు 4,5 తేదీల్లో పుతిన్ పర్యటనలో భారత్‌కు నాలుగు యుద్ధనౌకలు అందచేసే మరో ఒప్పందంపై కూడా సంతకాలు జరగనున్నాయి. ఈ ఒప్పందాల వల్ల భారత్‌కు ఎలాంటి ముప్పు వుండబోదని ప్రపంచ ఆయుధ వాణిజ్య విశ్లేష కేంద్రం అధ్యక్షుడు ఇగర్ కొరొషెంకొ వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో అమెరికా ఆయుధాలు కొనుగోలును భారతీయులు తిరస్కరించాలని వారు కోరుకోవడం లేదని కాబట్టి అమెరికా కూడా వారిపై ఆంక్షలు విధించదని ఆయన వ్యాఖ్యానించారు. దీనిపై అమెరికా రక్షణ శాఖ ప్రతినిధి స్పందిస్తూ ఆంక్షలు విధించే నిర్ణయం తీసుకోవాల్సింది అధ్యక్షుడే అని చెప్పారు. అయితే భారత్‌తో పెరుగుతున్న వ్యూహాత్మక భాగస్వామ్యానికి రక్షణ మంత్రి జిమ్ మాటిస్ గొప్ప విలువనిస్తున్నారని ఆయన తెలిపారు.

# 'భూ(తా)తల' స్వర్గం అరకు








అసలు సిసలు స్వేచ్ఛకు ప్రతిరూపాలుగా, ప్రకృతి ఒడిలో పెరిగిన పర్యావరణవేత్తలుగా మసలిన గిరిజనులు కొండా..కోనల్లో తిరిగి అటవీ వస్తువులు అమ్మి, కడుపునిండా తిని, థింసా నృత్యం చేసుకొని కులాసాగా బ్రతికేవారు.. అయితే రోగాలు..వచ్చినప్పుడు ఆస్పత్రులు, పిల్లలకు చదువులు, రోడ్లు లేక వాళ్లు ఇబ్బందులు పడుతున్న మాటల వాస్తవమే.. ఆ సౌకర్యాలన్నీ కల్పిస్తామంటూ గిరిజనేతరులు అక్కడికి వచ్చి, కాసులకు కక్కుర్తిపడి పర్యావరణానికి తీవ్ర ముప్పు కలిగిస్తున్నారు. స్వేచ్ఛగా పోడు వ్యవసాయం చేసుకునే వారిని కట్టడి చేస్తూ కొండలు, గుట్టలు స్వాధీనం చేసుకున్నారు. కరెన్సీ నోట్లే తప్ప ప్రకృతి, పర్యావరణం గురించి ఏమాత్రం పట్టించుకోని కార్పొరేట్ల కళ్లు కొండల రూపంలో అక్కడున్న బాక్సైట్ ఖనిజంపై పడింది. రోడ్లు నిర్మించారు..రాకపోకలు ఎక్కువయ్యాయి. పర్యావరణాన్ని, కోర్టులను, గ్రీన్ ట్రిబ్యునల్ తీర్పులను మైనింగ్ మాఫియా బేఖాతరు చేసింది. అంతే .. రాత్రికి రాత్రే కొండలను, గుట్టలను తవ్వుకునే పర్మిట్లు వచ్చాయి. ..దీంతో గిరిజనులకు గడ్డుకాలం వచ్చింది. రేయింబవళ్లు అక్కడ రణగొణి ధ్వనే.. బాక్సైట్‌ను, నల్లరాళ్లను తవ్వితవ్వి ప్రకృతి విధ్వంసానికి ఒడికడుతున్నారు. వివరాల్లోకి వెళితే..

విశాఖ జిల్లా హుకుంపేట మండలం గూడ చాలా చిన్న గిరిజన ప్రాంతం అందులో నల్లరాయి కొండలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో మొత్తం 17 సర్వే నెంబర్లు ఉన్నాయి. అందులో నుంచి 1-16 వరకు గూడ గ్రామానివే.. అయితే స్థానికులు మైనింగ్‌కు వ్యతిరేకిస్తున్నారని రెవెన్యూ అధికారులు రికార్డులు తారుమారు చేసి 1-14ను మిర్యాలగూడ పంచాయతీలోని పులపాడులోకి ఆ నెంబరును కలిపి మైనింగ్ చేస్తున్నారు. అందుకు కారణం ఈ గ్రామ ప్రజలు ఒప్పుకోకపోవడమే..

మైనింగ్ రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి ఓపెన్ బ్లాస్టింగ్ (కొండలను పేలుడు పదార్థాలతో పగుల గొట్టడం) చేస్తుండగా, రెండోది రిప్ ఓపెన్ బ్లాసింగ్. కొండ అడుగున 150 అడుగుల లోతువరకు పెద్దమొత్తంలో పేలుడు పదార్థాలను ఉపయోగించి కొండలను పెకలించడమే రిప్ బ్లాస్టింగ్. 24×7 జరిగే మైనింగ్ బ్లాస్టింగ్, క్రషింగ్ పనులతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానిక ప్రజలు చెబుతున్నారు. అంతేకాదు.. దాని నుంచి వెలువడిన దుమ్ము,దూళి, రజను పంటపొలాల నిండా పరచుకోవడంతో పంటదిగుబడులు తగ్గిపోయాయి. భూమిలోపల 150 మీటర్లవరకు జరుగుతున్న బ్లాసింగ్‌లతో ఇళ్లు పునాదులు కదులుతూ, గోడలు పగులుతున్నాయి, గర్భిణీల బాధ వర్ణనాతీతం.. అంతేకాదు.. నీరంతా కాలుష్యమవుతున్నాయి. ఈ బ్లాస్టింగ్‌కు 400 మీటర్ల పరిధిలో ఉన్న సంక్షేమ స్కూలు పిల్లలు పాఠాలు ఏకాగ్రతతో వినడానికి వీలు లేకుండా పోయిందని, ప్రహరిగోడ పడిపోతే మళ్లీ కట్టాల్సి వచ్చిందని స్థానికులు తెలిపారు. ఈ కాంట్రాక్టును మావోయిస్టుల దాడిలో మృతి చెందిన మాజీ ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు బావమరిది బుక్కారాజేంద్రప్రసాద్ నిర్వహిస్తున్నాడని వారు చెబుతున్నారు. గిరిజనేతరుడు తుమ్మిడి రాంబాబు దీన్ని సబ్‌కాంట్రాక్టర్‌గా వ్యవహరిస్తున్నాడని, 1/70చట్టప్రకారం గిరిజనేతరులు ఈ ప్రాంతంలో మైనింగ్ జరపడం నిషిద్ధమని అయినా వారు కొనసాగిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. 2007లో ప్రారంభించిన ఈ మైనింగ్ 2017 వరకు కొనసాగించే అర్హత సాధించగా, ప్రస్తుతం మరో పదేళ్లకు అంటే 2027 వరకు మైనింగ్ నిర్వహించేందుకు పర్మిట్‌ను పొడిగించుకున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 22న స్థానిక, మాజీ ఎమ్మెల్యేలను హత్యచేసిన మావోయిస్టులు తమ ఉనికిని చాటుకున్నారు.

నిన్నటివరకు మైనింగ్ దళారుల ఆగడాలకు విసిగిపోయిన స్థానికులు ప్రస్తుతం పోలీసుల నిఘా నేత్రంలోకి వెళ్లిపోయారు. ఎక్కడ..? ఎప్పుడు ?ఎవరిని అరెస్టు చేస్తారో తెలియని పరిస్థితి అక్కడ ఉంది. మూడు రోజుల క్రితం 10 మంది యువకులు మావోయిస్టులకు సమాచారం అందించారన్న అనుమానంతో పోలీసులు పట్టుకెళితే ఆడవాళ్లు, పిల్లలు అధికారుల కాళ్లపైపడి ఏడ్చి వారిని విడిపించుకున్నారు. కొండలు,గుట్టలు,అటవీ ప్రాంతం అంతా పోలీసుల చేతుల్లోకి వెళ్లిపోయింది. దీంతో పిల్లలు, పెద్దలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లతీస్తున్నారు. అత్యాశకు పోకుండా పోడు వ్యవసాయం చేస్తూ, తిండి,బట్ట, ఆరోగ్యం ఉంటే ప్రశాంతంగా బ్రతికే శ్రమ జీవులు ప్రసుత్తం ఏ నిముషం ఏం వినవలసి వస్తుందోనన్న భయంతో బ్రతుకు ఈడుస్తున్నారు. ఎవరో చేసిన దుశ్చర్యలకు మరొకరు బలవుతున్నారు.. ఈ పరిస్థితి మారాలని, తమ పాత జీవనశైలిని కొనసాగించేందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని గిరిజనులు ప్రాధేయపడుతున్నారు.

– ఖాన్

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/s Vastitude Media Pvt. Ltd., and Printed at M/s Jagati Publications Ltd., Sakshi Press, Survey No. 766/2, Ankireddy Palem Village, Guntur Rural, 522005, Guntur Distt. A.P. and Published at 6-45/1, Rayapudi, Thullur Mandal, Guntur Distt, Andhra Pradesh-522237. Editor: Pattan Hussain Khan, RNI NO: APTEL/2015/66622, Postal Regd No: GTR/84/2016-18, Cell 7680994755, Email : rajadhanivartalu1@gmail.com